# క్రైమ్ మిర్రర్

THE

Voice of Anti Corruption

హైదరాబాద్

17-8-2026

వెల: రూ.5/-

పేజీలు: 10+10

సంపుటి:16

సంచిక: 143

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

- సోమవారం నుంచి ఏపీ శాసనసభ వర్షాకాల సమావేశాలు
- ప్రతిపక్ష నేత హోదా ఇవ్వలేదన్న కారణంతో అసెంబ్లీకి వైసీపీ దూరం
- శాసనమండలిలో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని జగన్ వెల్లడి
- సభకు రావాలని వైసీపీ ఎమ్మెల్యేలకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు పిలుపు
- మెగా డీఎస్సీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై మండలిలో చర్చకు వైసీపీ వ్యూహం




2లో

## బెంగాల్ రాజకీయాల్లో కలకలం..

- పార్టీ ఆఫీస్‌లో ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించిన మాజీ డిప్యూటీ స్పీకర్
- పశ్చిమ బెంగాల్ మాజీ డిప్యూటీ స్పీకర్ ఆశిష్ బెనర్జీ అనుమానాస్పద మృతి
- బీర్భూమ్ జిల్లాలోని పార్టీ కార్యాలయంలో ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించిన వైనం
- ఐదుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన టీఎంసీ సీనియర్ నేత
- ఇటీవలి ఎన్నికల్లో ఓటమి, పార్టీ పదవికి రాజీనామా
- ఆత్మహత్య, కుట్ర కోణాల్లో దర్యాప్తు చేస్తున్న పోలీసులు



2లో

### మేడారం నుంచి ములుగుకు సీఎం వరాల జల్లు..

## రూ.868 కోట్ల పనులకు శ్రీకారం

- మేడారంలో కొత్త చేయూత పెన్షన్ లబ్ధిదారులకు పత్రాలు అందజేసిన సీఎం రేవంత్‌రెడ్డి
- ములుగులో రూ.868 కోట్లు, పరకాలలో రూ.443.42 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
- జంపన్నవాగు అభివృద్ధితోపాటు సాగునీటి ప్రాజెక్టులకు నిధులు ఇస్తామని హామీ

**ములుగు:** మేడారం వనదేవతల సాక్షిగా తెలంగాణ ప్రభుత్వం "చేయూత" పెన్షన్లకు శ్రీకారం చుట్టింది. ఆదివారం మేడారంలో పర్యటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమ్మక్క--సారలమ్మలను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అనంతరం కొత్తగా ఎంపికైన చేయూత పెన్షన్ లబ్ధిదారులకు పత్రాలను అందజేశారు. మేడారం అభివృద్ధి పనులను పరిశీలించిన సీఎం.. గట్టమ్మ ఆలయం వద్ద పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పైలాన్‌ను ఆవిష్కరించారు.

## 'దిమాగీ'పై దుమారం

### మావోలు, వేర్పాటువాదులకు మద్దతిచ్చేవాళ్లే దిమాగీ నక్సల్స్

ప్రధాని ప్రతిపక్షాలను ఉద్దేశించి మాట్లాడలేదన్న మంత్రి రిజిజు

విమర్శలు గుప్పించిన కాంగ్రెస్

2లో



న్యూఢిల్లీ: దేశంలో మావోయిస్టు తీవ్రవాదం అంతమైనప్పటికీ దిమాగీ నక్సల్స్(మేధో నక్సలైట్లు) మాత్రం సమాజానికి ముప్పుగా మారారని, వారిని గుర్తించి, ఏకాకులని చేయాలని, పూర్తిగా పక్కనపెట్టాలని స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు ఇచ్చిన పిలుపు పట్ల అధికార, విపక్షాల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. మోదీ వ్యాఖ్యల పట్ల కాంగ్రెస్ సహా ప్రతిపక్ష నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. అసమ్మతిని అణచివేయడానికే విపక్షాలపై దిమాగీ నక్సలైట్ అంటూ ముద్ర వేస్తున్నారని ఆరోపించారు. మోదీ వ్యాఖ్యలను అధికార బీజేపీ నాయకులు సమర్థించారు.

## భోగాపురం ఎయిర్‌పోర్ట్ రెడీ.. నేటి అర్ధరాత్రి నుంచి విమాన సర్వీసులు

- ఈ అర్ధరాత్రి నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్ వాణిజ్య సేవలు ప్రారంభం
- విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్‌లో వాణిజ్య కార్యకలాపాలు పూర్తిగా నిలిపివేత
- తొలి రోజు హైదరాబాద్, ఢిల్లీ సహా పలు నగరాలకు 31 విమాన సర్వీసులు
- రికార్డు సమయంలో పూర్తయిన ఈ ప్రాజెక్టును ఆగస్టు 1న ప్రధాని మోదీ ప్రారంభించారు
- ఉత్తరాంధ్ర ఆర్థికాభివృద్ధిలో ఈ విమానాశ్రయం కీలక పాత్ర పోషిస్తుందని అంచనా



2లో

### స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని ఫొటోకు

## మంత్రి ఉత్తమ్ షరతు

- మోదీ ఫొటో కావాలంటే సన్నబియ్యం డబ్బులివ్వండి: ఉత్తమ్
- సన్న బియ్యానికి కేంద్రం పూర్తి నిధులిస్తేనే ఫొటో ముద్రిస్తామని స్పష్టం
- పేదల రేషన్ కార్డుల విషయంలో రాజకీయాలు వద్దని హితవు
- రాష్ట్రం సన్నబియ్యం ఇస్తుంటే, కేంద్రం దొడ్డు బియ్యమే ఇస్తోందని విమర్శ
- ప్రొటోకాల్ ప్రకారం రేషన్ షాపుల్లో ఇప్పటికే ప్రధాని ఫొటో ఉందని వెల్లడి



## హైదరాబాద్–అమరావతి పక్కపక్కనే హైస్పీడ్ రైల్..

### హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ రైలు, ఫ్యూచర్ సిటీ-బందరు ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం



- రెండు ప్రాజెక్టులు ఒకదానికొకటి సమాంతరంగా నిర్మాణం
- రెండు మార్గాలకు కలిపి ఒకేసారి భూసేకరణ చేపట్టేందుకు ప్రణాళిక
- ఫ్యూచర్ సిటీ, అమరావతి, బందరు పోర్టు మధ్య కనెక్టివిటీ బలోపేతం
- ఎడమవైపు రోడ్డు, కుడివైపు రైలు మార్గం ఉండేలా అలైన్‌మెంట్ ఖరారు

హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి, బందరు పోర్టులను అనుసంధానించేలా రెండు భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు సమాంతరంగా పరుగులు పెట్టనున్నాయి. హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ రైల్వే లైన్, ఫ్యూచర్ సిటీ-బందరు పోర్టు 12 వరుసల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేలను పక్కపక్కనే నిర్మించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాథమికంగా అంగీకరించాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, హైదరాబాద్-విజయవాడ ప్రస్తుత జాతీయ రహదారికి ఎడమవైపు ఎక్స్‌ప్రెస్‌వే, కుడివైపు హైస్పీడ్ రైలు మార్గం ఉండేలా అలైన్‌మెంట్ ఖరారు చేశారు. 760 కిలోమీటర్ల




## వచ్చే వారం నుంచి ఉద్యోగ నోటిఫికేషన్ల జాతర!

- వచ్చే వారం నుంచి వరుసగా ఉద్యోగ నోటిఫికేషన్లు
- పారదర్శకతే లక్ష్యంగా టీజీపీఎస్సీ నియామక ప్రక్రియ
- ప్రతి ఆరు నెలలకు ఒకసారి పోటీ పరీక్షల నిర్వహణకు సర్కార్ ప్లాన్
- ఇప్పటికే 70 వేల ఉద్యోగాల భర్తీ పూర్తి చేశామన్న సీఎం రేవంత్
- వదంతులు నమ్మొద్దని, ప్రిపరేషన్‌పై దృష్టి పెట్టాలని యువతకు సూచన

తెలంగాణలోని నిరుద్యోగ యువతకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది.

## నేడు 'సర్' ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ

### 73,39,234 మంది (21.70 శాతం) ఓటర్ల తొలగింపు

- 3.38 కోట్ల నుంచి 2.64 కోట్లకు తగ్గనున్న ఓటర్ల సంఖ్య
- ముసాయిదాలో 93 లక్షల మందికి నేటి నుంచి నోటీసులు
- ఈఆర్వోల విచారణలో తేలనున్న వీరి భవితవ్యం
- మొత్తం ఓటర్లలో 50% మంది తొలగించిన, నోటీసులు అందుకోనున్న ఓటర్లే
- 3.38 కోట్ల మందిలో సురక్షిత ఓటర్లు 1.71 కోట్లే..
- వివరాలు వెల్లడించనున్న సీఈఓ కార్యాలయం



2లో

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణ (సర్)--2026 ప్రక్రియలో భాగంగా సోమవారం రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాలను ప్రకటించనున్నారు. 'సర్'ప్రక్రియ ప్రారంభానికి ముందు రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లుండగా..

# మేడారం నుంచి ములుగుకు సీఎం వరాల జల్లు..

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం ములుగు, పరకాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ములుగులో రూ.868 కోట్ల విలువైన పనులకు, పరకాలలో రూ.443.42 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ములుగులో నూతన కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభించి, కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ మేడారం వనదేవతలను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మేడారం ఆలయాన్ని రామప్ప దేవాలయానికి సమానంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. త్వరలో మల్లూరు నరసింహస్వామి ఆలయానికి నిధులు మంజూరు చేస్తామని, జంపన్నవాగును కూడా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోందని సీఎం పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక సమీక్ష నిర్వహించి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. ఆదివాసీ యువతకు సాంకేతిక, నైపుణ్య విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇంటర్ తర్వాత విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలని, జర్మనీ, జపాన్, కొరియా వంటి దేశాల్లో అవకాశాలు పొందేలా భాషా శిక్షణ కూడా అందిస్తామని పేర్కొన్నారు. మహిళలకు ఈ ఏడాది చిలకపచ్చ రంగు ఇందిరమ్మ చీరలను అందిస్తామని సీఎం వెల్లడించారు. ములుగు అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు అందిస్తే నిధులు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. ప్రజల సహకారంతో తెలంగాణను మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామని అన్నారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ములుగు అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. హైదరాబాద్‌తో సమానంగా ములుగును అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ములుగుకు పెద్ద సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని పేర్కొన్నారు.



# నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఉభయ సభలను సమావేశపర్చనున్నారు. అయితే, వైసీపీ.. అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించాలని నిర్ణయించడంతో ఈసారి కూడా సభ కూటమి సభ్యులతోనే జరగనుంది. ప్రతిపక్ష నేత (ఎల్ఓపీ) హోదా నిరాకరణకు నిరసనగా తమ బహిష్కరణ కొనసాగుతుందని వైసీపీ ఇప్పటికే స్పష్టం చేసింది. మరోవైపు, ఈ సమావేశాల్లో పలు కీలక అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ముఖ్యంగా ఎల్ నినో ప్రభావం, రైతుల సమస్యలు, అమరావతి రాజధాని నగర నిర్మాణ పనుల పురోగతి వంటి అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. ఈ అంశాలపై అధికారపక్షం తన వాదనను వినిపించనుంది.

**స్పీకర్ ఆహ్వానం.. వైసీపీ తిరస్కరణ**

సమావేశాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదివారం తెలిపారు. వైసీపీ సభ్యులు సభకు హాజరై ప్రజా సమస్యలను ప్రస్తావిస్తే, సంబంధిత మంత్రుల నుంచి సమాధానాలు ఇప్పించే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యలపై చర్చించడం, తమ నియోజకవర్గాల వాణిని వినిపించడం శాసనసభ్యుల బాధ్యత అని, జగన్ తో సహా వైసీపీ ఎమ్మెల్యేలందరూ సభకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. గతంలో, అసెంబ్లీకి హాజరుకాని ఎమ్మెల్యేలకు జీతాలు ఎందుకు చెల్లించాలని స్పీకర్ ప్రశ్నించారు. ఈ అంశంపై పార్లమెంటులో చర్చించి, తగిన చట్టం తీసుకురావాలని కూడా ఆయన సూచించడం గమనార్హం.

## భోగాపురం ఎయిర్‌పోర్ట్ రెడీ.. నేటి అర్ధరాత్రి నుంచి విమాన సర్వీసులు



ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా భోగాపురంలో కొత్తగా నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి వాణిజ్య విమాన సర్వీసులు ఆదివారం అర్ధరాత్రి నుంచి ప్రారంభం కానున్నాయి. దీనితో పాటు, విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్‌లోని (ఐఎన్ఎస్ డేగా) సివిల్ ఎన్‌క్లేవ్‌లో వాణిజ్య కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోనున్నాయి. ఈ అర్ధరాత్రి 12:01 గంటల నుంచి భోగాపురం విమానాశ్రయం పూర్తిస్థాయిలో పనిచేస్తుందని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఇప్పటికే అధికారికంగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో అన్ని విమానయాన సంస్థలు తమ సేవలను విశాఖపట్నం నుంచి భోగాపురానికి మార్చాయి. తొలిరోజే హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు, కోల్‌కతా, తిరుపతి వంటి నగరాలకు 31 సర్వీసులు నడపడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. పాత విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్‌కు ఉన్న 'ఝ్గ' ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ కోడ్‌ను కూడా భోగాపురం విమానాశ్రయానికి బదిలీ చేశారు. అయితే, జాతీయ అత్యవసర పరిస్థితులు, భారత వైమానిక దళం, ఇతర రక్షణ దళాలు, పోలీసు, ప్రభుత్వ ప్రత్యేక వీఐపీ విమానాల రాకపోకలకు మాత్రం విశాఖ ఎయిర్‌పోర్ట్‌ను వినియోగించనున్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆగస్టు 1న ఈ విమానాశ్రయాన్ని లాంఛనంగా ప్రారంభించారు. సుమారు రూ. 4,727 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం కేవలం 31 నెలల్లోనే పూర్తయి, దేశంలో అత్యంత వేగంగా నిర్మించిన విమానాశ్రయాల్లో ఒకటిగా నిలిచింది. షెడ్యూల్ కంటే దాదాపు ఐదు నెలల ముందే దీని నిర్మాణం పూర్తి కావడం విశేషం. ఈ ఎయిర్‌పోర్ట్‌కు ఇప్పటికే డీజీసీఏ ఏరోడ్రోమ్ లైసెన్స్‌తో పాటు అవసరమైన అన్ని భద్రత, అగ్నిమాపక, పర్యావరణ అనుమతులు లభించాయి. మొదటి దశలో ఏటా 60 లక్షల మంది ప్రయాణికులకు సేవలందించేలా దీన్ని రూపొందించారు. భవిష్యత్తులో దీని సామర్థ్యాన్ని ఏటా 4 కోట్ల మంది ప్రయాణికులకు పెంచేలా మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశారు.

## స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని ఫొటోకు మంత్రి ఉత్తమ్ షరతు

స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రాన్ని ముద్రించాలన్న డిమాండ్‌పై తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. సన్న బియ్యం పథకానికి కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులు సమకూరిస్తేనే, కార్డులపై ప్రధాని ఫొటోను ముద్రించే అంశాన్ని పరిశీలిస్తామని ఆయన స్పష్టం చేశారు. పేదల ఆకలి తీర్చే ఈ పథకం విషయంలో అనవసర వివాదాలు సృష్టించవద్దని ఆయన హితవు పలికారు.సూర్యాపేటలో నిన్న మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి.. రేషన్ బియ్యం పంపిణీపై కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు సన్న బియ్యం సరఫరా చేసేందుకు రూ. 14.9 కోట్లు ఖర్చు చేస్తోందని, అయితే కేంద్రం నుంచి కేవలం దొడ్డు బియ్యం మాత్రమే సరఫరా అవుతున్నాయని ఆయన తెలిపారు. కొందరు తగినంత ఆర్థిక సహకారం అందించకుండానే రేషన్ బియ్యం పంపిణీపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.కేంద్ర ప్రభుత్వం పట్ల ఉన్న గౌరవంతో, ప్రొటోకాల్‌కు అనుగుణంగా ఇప్పటికే రేషన్ దుకాణాల్లో ప్రధాని ఫొటోను ప్రదర్శిస్తున్నామని ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన చిత్రాలను కార్డులపై ముద్రించడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## నేడు 'సర్' ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ

ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం ప్రచురించనుంది. ఇక ముసాయిదా జాబితాలో ఉండే 2.64 కోట్ల మందిలో 93 లక్షల మందికి పైగా ఓటర్ల వివరాల్లో తేడాలు (అనామలీస్) కలిగి ఉండడం, మ్యాపింగ్ జరగకపోవడంతో వారిని 'అనుమానాస్పద'ఓటర్లుగా ఎన్నికల సంఘం గుర్తించింది. సోమవారం నుంచి అక్టోబర్ 15 వరకు వీరికి స్థానిక ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్వోలు) నోటీసులు జారీ చేసి విచారణకు పిలుస్తారు. తొలగించనున్న 73 లక్షల మంది ఓటర్లు, నోటీసులు అందుకోనున్న 93 లక్షల మంది ఓటర్లు కలిపితే 1.66 కోట్ల మంది కానున్నారు. అంటే, మొత్తం 3.38 కోట్ల మందిలో దాదాపుగా 49--50 శాతం మంది ఓటర్లు జాబితాలో తమ పేరు తొలగింపు ముప్పును ఎదుర్కొంటున్నారు.

**ఫారం నింపలేక ...**

నోటీసులు అందుకోనున్న 93 లక్షల మందిలో 32.36 లక్షల మంది ఓటర్లు అన్‌మ్యాప్డ్ ఓటర్లు ఉండగా, మిగిలిన 61.4 లక్షల మంది ఓటర్ల వివరాల్లో తేడాలున్నట్టు గుర్తించారు. 'సర్--2002'ఓటర్ల జాబితాలో తమ పేరు/తమ తల్లిదండ్రులు/వారి తల్లిదండ్రుల పేరు ఉన్నట్టు ఎన్యూమరేషన్ ఫారంలో పూరించాల్సి ఉండగా, ఈ వివరాలను ఇవ్వడంలో విఫలమైన/ లేక తప్పుడు వివరాలు ఇచ్చిన 32.36 లక్షల మంది ఓటర్లను అన్‌మ్యాప్డ్ ఓటర్లుగా గుర్తించారు. ఓటర్లకు అవగాహన కల్పించడంలో విఫలం కావడంతో చాలామంది ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారంలోని 'సర్--2002'ఓటర్ల జాబితాలోని వివరాలు రాయాల్సిన భాగంలో ప్రస్తుత ఓటర్ల జాబితాలోని వివరాలు రాశారు. దీంతో వీరు సైతం నోటీసులు అందుకోక తప్పదు. నోటీసులు వచ్చాక వీరంతా విచారణకు హాజరై ఎన్నికల సంఘం నిర్దేశించిన 11 రకాల పత్రాల్లో ఏదో ఒక పత్రాన్ని రుజువుగా చూపించాల్సి ఉంటుంది. జూలై 15కి ముందు జారీ చేసిన ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌ను సైతం తాజాగా ఈ జాబితాలో ఈసీ చేర్చింది. విచారణలో ఈఆర్వోలు సంతృప్తి చెందితేనే అక్టోబర్ 19న ప్రకటించే తుది 'సర్'ఓటర్ల జాబితాలో వీరి పేర్లను ప్రచురిస్తారు. 73,39,234 మంది ఓటర్లను తొలగించి వారి పేరుతో 'ఏఎస్‌డీడీ'(అబ్సెంటీ, షిఫ్టెడ్, డెడ్, డూప్లికేట్) ఓటర్ల జాబితాను ప్రత్యేకంగా ఎన్నికల సంఘం ప్రచురించనుంది.

# 'దిమాగీ'పై దుమారం

ప్రతిపక్షాలు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నాయని పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు మండిపడ్డారు. ప్రతిపక్ష నాయకుల గురించి కాకుండా.. కేవలం మావోయిస్టులకు, వేర్పాటువాదులకు మద్దతునిస్తూ భారత రాజ్యాంగాన్ని వ్యతిరేకించే వ్యక్తుల గురించి మాత్రమే ప్రధానమంత్రి మాట్లాడారని స్పష్టంచేశారు. ఈ మేరకు ఆదివారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. "ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిపక్ష నేతలను దిమాగీ నక్సల్స్ అనలేదు. 1.మావోయిస్టులకు మద్దతు ఇస్తూ భారత రాజ్యాంగాన్ని వ్యతిరేకించేవారు. 2.వేర్పాటువాదులతో అండగా నిలుస్తూ ఆర్?టకల్ 370కి మద్దతిచ్చే వారు. 4.భారతదేశం నుంచి ఈశాన్య ప్రాంతాన్ని వేరు చేయడానికి కోడి మెడ(చికెన్ నెక్)ను కత్తిరించాలని కుట్రలు సాగించేవారు మాత్రమే దిమాగీ నక్సల్స్" అని కిరణ్ రిజిజు తేల్చిచెప్పారు.

**3 వస్తుంది, 4 కాదు: పవన్ ఖేరా**

పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు చేసిన ట్వీట్‌పై కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ పవన్ ఖేరా 'ఎక్స్'లో వ్యంగ్యంగా స్పందించారు. "సోదరా కిరణ్ రిజిజు.. ముందు మీ లెక్కింపును సరిచేసుకోండి. అప్పుడు మేము సమాధానం ఇస్తాము. 1, 2 తర్వాత 3 వస్తుంది, 4 కాదు" అని పోస్టుచేశారు. పవన్ ఖేరా ట్వీట్‌పై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, సీనియర్ నేత జైరామ్ రమేశ్ ప్రతిస్పందించారు. "సమస్త రాజకీయ శాస్త్రపు అద్భుతం" అని పేర్కొన్నారు. "నేను దిమాగీ నక్సలైట్ అయినందుకు గర్విస్తున్నాను" అంటూ కాంగ్రెస్ నేత, కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం సైతం 'ఎక్స్'లో పోస్టుచేశారు. పి.చిదంబరం పోస్టుపై బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) బి.ఎల్.సంతోష్ విమర్శలు గుప్పించారు. "ఇందులో ఆశ్చర్యం లేదు.

## బెంగాల్ రాజకీయాల్లో కలకలం..

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో తీవ్ర విషాదం, కలకలం చోటుచేసుకుంది. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) సీనియర్ నాయకుడు, రాష్ట్ర అసెంబ్లీ మాజీ డిప్యూటీ స్పీకర్ ఆశిష్ బెనర్జీ (80) అనుమానాస్పద స్థితిలో మరణించారు. బీర్భూమ్ జిల్లా రాంపూర్‌హాట్‌లోని తన నివాసానికి సమీపంలో ఉన్న పార్టీ కార్యాలయంలో ఆయన మృతదేహం ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. ఈ ఘటనతో అధికార టీఎంసీ వర్గాలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్ట్‌మార్టం నిమిత్తం రాంపూర్‌హాట్ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించారు. ఇది ఆత్మహత్యా? లేక దీని వెనుక ఏదైనా కుట్ర ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఆశిష్ బెనర్జీకి బెంగాల్ రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉంది. రాంపూర్‌హాట్ నియోజకవర్గం నుంచి ఆయన ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. మమతా బెనర్జీ ప్రభుత్వంలో విద్య, వ్యవసాయ శాఖల మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా కూడా సేవలు అందించారు. అయితే, ఈ ఏడాది మొదట్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన బీజేపీ అభ్యర్థి ధ్రువ సాహా చేతిలో ఓటమి పాలయ్యారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత, జూన్‌లో బీర్భూమ్ జిల్లా టీఎంసీ కోర్ కమిటీ ఛైర్మన్ పదవికి కూడా ఆశిష్ బెనర్జీ రాజీనామా చేశారు. అప్పటి నుంచి ఆయన రాజకీయంగా కొంత ఒత్తిడిలో ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో టీఎంసీకి కంచుకోటగా ఉన్న బీర్భూమ్ జిల్లాలో ఇటీవలి ఎన్నికల్లో బీజేపీ అనూహ్యంగా 6 స్థానాలు గెలుచుకోవడం టీఎంసీకి పెద్ద ఎదురుదెబ్బగా మారింది.



## వచ్చే వారం నుంచి ఉద్యోగ నోటిఫికేషన్ల జాతర!


ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేస్తూ వచ్చే వారం నుంచి వివిధ శాఖల్లోని ఖాళీల భర్తీకి వరుసగా నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్లు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ప్రకటించింది. మరోవైపు ప్రభుత్వ శాఖల్లో ఏర్పడే ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేసేందుకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి పోటీ పరీక్షలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ రెండు కీలక ప్రకటనలతో ఉద్యోగార్థుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.నిన్న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా టీజీపీఎస్సీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఛైర్మన్ బుర్రా వెంకటేశం మాట్లాడారు. నియామక ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. చిన్న పొరపాటు జరిగినా వేలాది మంది అభ్యర్థుల భవిష్యత్తుపై ప్రభావం పడుతుందని, అందుకే ప్రతి దశలోనూ అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తామని తెలిపారు. ప్రశ్నాపత్రాల రూపకల్పన నుంచి మూల్యాంకనం వరకు అన్ని ప్రక్రియల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, పొరపాట్లకు తావులేని వ్యవస్థను రూపొందిస్తున్నట్లు వివరించారు.ఇదే సమయంలో సంగారెడ్డిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే సుమారు 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని గుర్తుచేశారు. ఇటీవల మరో 10 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చామన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఏర్పడే ఖాళీలను గుర్తించి, ప్రతీ ఆరు నెలలకు ఒకసారి నోటిఫికేషన్ ఇచ్చి పరీక్షలు నిర్వహించేలా పటిష్టమైన విధానాన్ని తీసుకొస్తామని ప్రకటించారు. ఉద్యోగాల భర్తీ బాధ్యత ప్రభుత్వానిదేనని, నిరుద్యోగ యువత ఎలాంటి వదంతులను నమ్మకుండా పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. టీజీపీఎస్సీ, ప్రభుత్వం నుంచి వచ్చిన ఈ స్పష్టమైన హామీలతో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతలో ఉత్సాహం నెలకొంది.

# హైదరాబాద్-అమరావతి పక్కపక్కనే హైస్పీడ్ రైల్..

హైస్పీడ్ రైలు మార్గం హైదరాబాద్-అమరావతి-చెన్నై మధ్య ప్రతిపాదించిన ఈ హైస్పీడ్ రైల్వే కారిడార్ మొత్తం పొడవు 760 కిలోమీటర్లు. ఇందులో తెలంగాణ పరిధిలో 180 కిలోమీటర్ల మేర నిర్మాణం జరగనుంది. ఈ మార్గంలో శంషాబాద్, భారత్ ఫ్యూచర్ సిటీ, డ్రై పోర్టు, నాగార్జునసాగర్ (హాలియా), వాడపల్లి వద్ద స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 2.24 లక్షల కోట్లు కాగా, దాదాపు 790 హెక్టార్ల భూమి అవసరమని ప్రాథమికంగా నిర్ధారించారు. ఇప్పటికే ఈ మార్గంలో మార్కింగ్ పనులు పూర్తయ్యాయి.

**298 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే**

హైదరాబాద్ ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్), రీజినల్ రింగు రోడ్డు (ట్రిపుల్ ఆర్) మధ్యలో ఉన్న ముచ్చర్ల ఫ్యూచర్ సిటీ సమీపంలోని తిప్పారెడ్డిపల్లి వద్ద ఈ 12 వరుసల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే ప్రారంభం కానుంది. ఇది అమరావతి మీదుగా మచిలీపట్నం-బందరు పోర్టుకు అనుసంధానమవుతుంది. మొత్తం 297.82 కిలోమీటర్ల పొడవున్న ఈ మార్గంలో తెలంగాణ పరిధిలో 118 కిలోమీటర్లు (40 గ్రామాల మీదుగా), ఏపీలో మిగిలిన భాగం (60 గ్రామాల మీదుగా) విస్తరించి ఉంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ రెండు భారీ ప్రాజెక్టులకు వేర్వేరుగా కాకుండా ఒకేసారి భూసేకరణ చేపట్టాలని అధికారులు యోచిస్తున్నారు. ఒకే కారిడార్‌లో రోడ్డు, రైలు మార్గాల నిర్మాణం వల్ల భూసేకరణ భారం తగ్గడమే కాకుండా, హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి, బందరు పోర్టుకు ప్రయాణ, సరుకు రవాణా సమయం గణనీయంగా ఆదా కానుంది.



# గ్రామాల్లో ఘనంగా బోనాల పండుగ

**భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాల సమర్పణ.. పల్లెల్లో మార్మోగిన భక్తి సందడి**





**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో , ఆగస్టు 16 (క్రైమ్ మిర్రర్):** తెలంగాణ పల్లె సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ గ్రామాల్లో ఘనంగా జరిగింది. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, బోనాలను అందంగా అలంకరించి డప్పు చప్పుళ్ల మధ్య అమ్మవారి ఆలయాలకు ఊరేగింపుగా తీసుకెళ్లి భక్తిశ్రద్ధలతో సమర్పించారు. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. డప్పు వాయిద్యాల నడుమ మహిళల బోనాల ఊరేగింపులు, గ్రామాల్లో పండుగ సందడిని మరింత పెంచాయి. కుటుంబ సమేతంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.పాడిపంటలు సమృద్ధిగా పండాలని.. గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని భక్తులు వేడుకున్నారు. బోనాల సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు, పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.తెలంగాణ పల్లె జీవన విధానం, ఆచార వ్యవహారాలు, భక్తి విశ్వాసాలకు బోనాల పండుగ అద్దం పడుతోందని స్థానికులు పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ భక్తులు ఉత్సాహంగా బోనాల వేడుకల్లో పాల్గొన్నారు.

## కృష్ణా నది ఒడ్డున గుర్తు తెలియని మహిళా మృతదేహం లభ్యం



**క్రైమ్ మిర్రర్ , పాలకీడు :** పాలకీడు మండలం మహంకాళి గూడెం కృష్ణా నది ఒడ్డున ఆదివారం గుర్తు తెలియని ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాత్రి 8:00 గంటల సమయంలో మహంకాళి గూడెం కృష్ణ నది ఒడ్డు న గుర్తు తెలియనీ వివాహం అయిన ముస్లిం మహిళ వయసు సుమారు 20-25 వయస్సు కలిగిన ముస్లిం మహిళ మృత దేహం లబ్యమఅయినదనీ ఇట్టి మహిళ వివరాలు తెలిసిన యెడల సీఐ హుజూర్ నగర్ 8712686012, ఎస్ఐ పాలకవీడు 8712686055 నంబర్ లకు ఫోన్ చేసి మృతురాలికి సంబంధించిన వివరాలు తెలిస్తే పాలకీడు పోలీసు స్టేషన్లో సమాచారం అందించాలని మండల ఎస్సై కోటేష్ తెలిపారు.

## తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర కమిటీ పునర్వ్యవస్థీకరణ...



**మియాపూర్ క్రైమ్ మిర్రర్ :** మియాపూర్ ఎం.ఎ నగర్‌లోని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతరాజు లాలయ్య నివాసంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం లాలయ్య అధ్యక్షతన జరిగింది.సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పనిచేసిన మేకల చేరాలు మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. అనంతరం రాష్ట్ర కమిటీని పునర్వ్యవస్థీకరిస్తూ తీర్మానించారు. వెలమకంటి దయాకర్ ను రాష్ట్ర అధ్యక్షుడిగా పారంది స్వామిలిని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పోతరాజు లాలయ్య జన్ను నరసయ్యలను రాష్ట్ర అధ్యక్షులుగా నియమించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి తూముల సదానందం, ఉపాధ్యక్షురాలు మల్లెల్ల జయశ్రీ, రాష్ట్ర కార్యదర్శి డప్పు నగేష్, గ్రేటర్ అధ్యక్షులు ఘనపురం రవిందర్ తదితరులు పాల్గొన్నారు.తెలంగాణ అంబేద్కర్ సంఘం నూతన కమిటీ మియాపూర్‌లో జరిగిన తెలంగాణ అంబేద్కర్ సంఘం సమావేశంలో వెలమకంటి దయాకర్ రాష్ట్ర అధ్యక్షుడిగా, పారంది స్వామి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. పోతరాజు లాలయ్య, జన్ను నరసయ్యలను అధ్యక్షులుగా నియమించారు.

# చిట్యాల మండలంలో ప్రతి సోమవారం ప్రజావాణి

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునిపరిష్కరించేందుకు చిట్యాల మండల స్థాయిలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల ప్రజా పరిషత్ అధికారులు తెలిపారు.జిల్లా కలెక్టర్, నల్లగొండ ఆదేశాల మేరకు మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆగస్టు 17, 2026 సోమవారం ఉదయం 10 గంటలకు చిట్యాల మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం ప్రారంభం కానుంది. మండల పరిధిలోని ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందవచ్చని అధికారులు తెలిపారు. అలాగే మండల స్థాయి అధికారులు తమ తమ శాఖలకు సంబంధించిన సమాచారంతో ఉదయం 9.40 గంటలకు కార్యాలయానికి హాజరుకావాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

## లచ్చమ్మ గూడెం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులుగా - అలుగు వెళ్లి సుధాకర్ రెడ్డి



**సంస్థాన్ నారాయణపురం, ఆగస్టు 16(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం లచ్చమ్మ గూడెం గ్రామ సర్పంచ్ తోటకూరి శంకర్ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర నాయకులు జక్కలి ఐలయ్య యాదవ్ విచ్చేసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని అదేవిధంగా గ్రామంలో చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి తెలుసుకొని కావలసిన నిధులను ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ద్వారా మంజూరు చేయించడానికి కృషి చేస్తానని తెలియజేయడం జరిగింది. అనంతరం గ్రామ శాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగాఎన్నుకున్నారు అధ్యక్షులుగా అలుగు వెళ్లి సుధాకర్ రెడ్డి ప్రధాన కార్యదర్శిగా పగిళ్ల రవీందర్ ఉపాధ్యక్షులుగా వీరమల్ల జంగయ్య కార్యదర్శిగా బొడ్డు అలివేలు కోశాధికారిగా పాశం లక్ష్మీప్రసన్న తో పాటు 8 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు జక్కలి విక్రమ్ యాదవ్ , పాశం శంకర్ రెడ్డి , పాలకూరి కాశయ్య , బొడ్డు మల్లేష్ ,దాసరి సుధాకర్ గుదే మహేష్ , దుబ్బాక వెంకటేష్, పంతంగి సత్తయ్య, జక్కలి సైదులు, బోయపల్లి శేఖర్, నన్నూరు జగన్ రెడ్డి. దండు పుల్లారెడ్డి గుదే లింగయ్య రమేష్. అబ్బాయా. గండికోట వెంకటేష్. మహేష్, లక్ష్మయ్యగండికోట మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వరుణ దేవుడి కరుణకై 'కప్ప కాముడు'

## వర్షాల కోసం తెలంగాణ సంప్రదాయాన్ని పాటించిన వట్టిపల్లి మహిళలు



**మర్రిగూడ (క్రైమ్ మిర్రర్):** సకాలంలో వర్షాలు కురవక పంటల సాగుపై ఆందోళన చెందుతున్న రైతులు, వరుణ దేవుడి కరుణ కోసం సంప్రదాయ ఆచారాలను ఆశ్రయించారు. మండలంలోని వట్టిపల్లి గ్రామంలో మహిళలు తెలంగాణ గ్రామీణ సంప్రదాయంలో భాగమైన 'కప్ప కాముడు' ఆటను నిర్వహించి వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షించారు. వర్షాలు ఆలస్యమవడంతో గ్రామీణ ప్రాంతాల్లో రైతుల్లో ఆందోళన నెలకొంది. సమయానికి వానలు కురువకుండా, వరుణుడు ముఖం చాటేయడంతో పంటల పరిస్థితిపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వర్షాలు కురవాలని కోరుతూ గ్రామంలోని మహిళలు సంప్రదాయ పద్ధతిలో కప్ప కాముడు ఆట ఆడారు. తెలంగాణ పల్లె సంస్కృతిలో వర్షాల కోసం నిర్వహించే సంప్రదాయ ఆచారాల్లో కప్ప కాముడికి ప్రత్యేక స్థానం ఉంది. కప్పల ఆటను నిర్వహించడం ద్వారా వరుణ దేవుడు కరుణించి వర్షాలు కురిపిస్తారనే విశ్వాసం తరతరాలుగా గ్రామీణ ప్రజల్లో కొనసాగుతోంది. ఆధునిక కాలంలోనూ ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, మహిళలు వర్షాల కోసం ప్రార్థనలు చేయడం గ్రామంలో ప్రత్యేకంగా నిలిచింది. మరోవైపు వాతావరణ పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాల భయంతో ప్రజల్లో ఆందోళన నెలకొన్న నేపథ్యంలో, సకాలంలో వర్షాలు కురిసి పంటలకు అనుకూల పరిస్థితులు ఏర్పడాలని గ్రామస్తులు భగవంతుడిని కోరుతున్నారు. వరుణుడు కరుణించి సమృద్ధిగా వర్షాలు కురిపించి రైతుల కష్టాలు తీర్చాలని మహిళలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జింకల యాదమ్మ, శిరసవాడ చిట్టెమ్మ, తుప్పరి సుగుణమ్మ, మామిడి యాదమ్మ తదితర మహిళలు పాల్గొన్నారు.

# టంగుటూరు గ్రామంలో ఘనంగా ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవం





**క్రైమ్ మిర్రర్ -- శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి మండలం టంగుటూరు గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య హాజరై, గడ్డం అరుణ నూతన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టంగుటూరు సర్పంచ్ బద్దం హరితా కృష్ణారెడ్డి ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, శంకర్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లారం వెంకటరెడ్డి , శంకర్‌పల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రమౌళి డీసీసీ వైస్ ప్రెసిడెంట్ గోపాల్ రెడ్డి మోకిలా సర్పంచ్ శేఖర్ మోకిలా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సత్యనారాయణ పిల్లిగుండ్ల సర్పంచ్ కాంత్ రెడ్డి అలంకన్ మాజీ సర్పంచ్ నరేందర్ రెడ్డి గారు, సీనియర్ నాయకులు పోలీస్ రామిరెడ్డి టంగుటూరు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహిపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాణిక్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నూతన ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం కావడంతో గడ్డం అరుణ కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలో అర్హులైన పేద కుటుంబాలకు మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావాలని స్థానికులు ఆకాంక్షించారు.

# గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులపై దాడి దుర్మార్గం

**బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలి**

**యుఎస్ఎఫ్ఐ పిడిఎస్ యు జీవీఎస్ విద్యార్థి సంఘాలు డిమాండ్**



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో :** ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలోని గిరిజన సంక్షేమ గురుకుల (ట్రైబల్ వెల్ఫేర్) పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సుమారు 15 మంది విద్యార్థులపై సీనియర్ విద్యార్థులు మద్యం మత్తులో దాడికి పాల్పడటం అత్యంత విచారకరం ఖండనీయం. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బొట్ల సాగర్ పిడిఎస్ యు జిల్లా అధ్యక్షులు జి మస్తాన్ జీవీఎస్ విద్యార్థి సంఘం నాయకులు బాలాజీ నాయక్ లు మాట్లాడుతూ సీనియర్ల వేధింపులు దాడులు తాళలేక భయంతో 10వ తరగతి విద్యార్థులు రాత్రంతా సమీపంలోని అడవిలో తలదాచుకోవాల్సి రావడం పాఠశాల యాజమాన్య నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. గురుకులంలో విద్యార్థులకు కనీస రక్షణ లేకుండా పోయిందని మద్యం మత్తులో దాడులు జరుగుతున్నా వార్డెన్ ప్రిన్సిపాల్ పర్యవేక్షణ లోపించడం సిగ్గుచేటు. ఈ ఘోర ఉదంతాన్ని నిరసిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యంతో యుఎస్ఎఫ్ఐ పిడిఎస్ యు జీవీఎస్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురుకుల పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. విద్యార్థులపై దాడికి పాల్పడిన బాధ్యులపై మరియు నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల అధికారులపై సమగ్ర విచారణ జరిపించాలి.మద్యం సేవిస్తూ దాడులకు తెగబడిన వారిపై విధి నిర్వహణలో విఫలమైన వార్డెన్ ప్రిన్సిపాల్ బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి. గురుకులంలో చదువుకుంటున్న విద్యార్థులకు పూర్తిస్థాయి భద్రత కల్పించాలి.దాడికి గురై తీవ్ర భయాందోళనకు గురైన 10వ తరగతి విద్యార్థులకు తగిన ధైర్యం చెప్పి ప్రత్యేక వైద్యం కౌన్సెలింగ్ అందించాలి.పాఠశాలలో విద్యార్థుల భద్రతపై స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు మరియు బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు మా పోరాటం ఆగదని విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతుంది

### పార్కు స్థలాలను అమ్మి భవిష్యత్తును అంధకారం చేస్తుంది

### కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టండి...

### బిఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్వంత్ కుమార్



**కూకట్ పల్లి, ఆగస్టు 16 (క్రైమ్ మిర్రర్) :** ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన అంటూ నేడు ప్రజా వ్యతిరేక పాలన చేస్తుందని బిఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్వంత్ దుయ్యబట్టారు. కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాలకు లక్ష రూపాయలకు తోడు తులం బంగారం ఇస్తానన్న రేవంత్ రెడ్డి సర్కారు నేడు ఆ లక్ష రూపాయలకు కూడా దిక్కు లేకుండా చేసిందని.. నిరుపేదల ఆడబిడ్డలకు ఉపయోగపడుతుందని ఆనాడు తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పథకాన్ని ప్రారంభిస్తే దానికి చట్టపద్ధత లేదు అంటూ దాన్ని కూడా ఆపడం ప్రజలు అన్నీ గమనిస్తున్నారని అని అన్నారు. ఉన్న స్థలాలను అమ్మేసి డబ్బులు చేసుకుని కనీసం చిన్నపిల్లలుకు ఉపయోగపడే పార్కు స్థలాలును కూడా అమ్మి వారి భవిష్యత్తును అంధకారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పాతిపెట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. 420 అబద్ధపు హామీలను చెప్పి అధికారంలోకి వచ్చి నేడు అన్ని రంగాలను భ్రష్టు పట్టించిన ఈ ప్రభుత్వానికి త్వరలోనే బుద్ధి చెబుతావని ప్రజలు కూడా ఎదురుచూస్తున్నారని అన్నారు. ఈ ప్రజా వ్యతిరేక పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లి వారి వైఫల్యాన్ని ఎండగట్టే బాధ్యత తీసుకుంటామని మా నాయకుడు కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచనలతో ముందుకు వెళ్తామని సందర్భంగా అశ్వంత్ తెలియజేశారు.



## మాజీ ఎంపీపీ ఎర్ర నర్సయ్యని పరామర్శించిన తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు డా.గాదరి కిశోర్ కుమార్



జాజిరెడ్డిగూడెం, ఆగష్టు 16(క్రైమ్ మిర్రర్): సూర్యాపేట జిల్లా: జాజిరెడ్డిగూడెం మండలం పర్సాయపల్లి గ్రామంలో సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ ఎర్ర నర్సయ్య ఇటీవల ప్రమాదవశాత్తు కాలుకు గాయం కావడంతో వారిని పరామర్శించి, అనంతరం బీఆర్ఎస్ నాయకులు కొర్రపిడత వీరయ్య అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించిన తుంగతుర్తి మాజీ శాసనసభ్యులుడా .గాదరి కిశోర్ కుమార్ ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నాయకుల కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే డా.గాదరి కిశోర్ కుమార్





**తిరుమలగిరి, ఆగష్టు 16(క్రైమ్ మిర్రర్):** సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ నాయకులు గిలకత్తుల నవీన్ గౌడ్ తండ్రి గిలకత్తుల ఉప్పలమల్లయ్య ఇటీవల మరణించడంతో వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు డా.గాదరి కిశోర్ కుమార్ ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు వైద్య సేవలు అందించడమే నా ఏకైక లక్ష్యం

### బి కే ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు బొంగునూరి కిషోర్ రెడ్డి

**కుత్బుల్లాపూర్, ఆగష్టు 16 (క్రైమ్ మిర్రర్):** పేద ప్రజలకు వైద్య సేవలు అందించడమే నా ఏకైక లక్ష్యం అని బి కే ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు బొంగునూరి కిషోర్ రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, దుండిగల్ డివిజన్ పరిధిలోని దుండిగల్ తాండ 2 బి కే ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 56 వ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రోటోకాల్ కోఆర్డినేషన్ వైస్ చైర్మన్ బి కే ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు బొంగునూరి కిషోర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషోర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఉచిత వైద్య శిబిరాలను నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. దుండిగల్ తండా 2 పరిసర ప్రాంతాల ప్రజలు ఈ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాజేష్ నాయక్, నర్సింహారెడ్డి, గణేష్ నాయక్, ఆకాష్, కృష్ణ, మహేష్, సందీప్, రిజ్వాన్, టీమ్ బికెఆర్ సభ్యులు, స్థానిక ప్రజలు నిర్వాహకులు పాల్గొన్నారు.




## తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బోనాల పండుగ

### బండ మైసమ్మ అమ్మ బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న బండి రమేష్



**కూకట్ పల్లి, ఆగస్టు 16 (క్రైమ్ మిర్రర్) :** కూకట్ పల్లి నియోజకవర్గం, మూసాపేట్ డివిజన్‌లో నిర్వహించిన శ్రీ బండ మైసమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాల్లో టీపీసీసీ ఉపాధ్యక్షులు, జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, బండ మైసమ్మ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, మూసాపేట్ డివిజన్ ప్రెసిడెంట్ తూము సంతోష్, తోట రాజు, పల్లపు సత్యనారాయణ, పల్లపు రాజు, సంపంగి సంపంగి, మొక్కల రాజేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## రాజపేటలో ఘనంగా మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు



**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో , ఆగస్టు 16 (క్రైమ్ మిర్రర్ ):** యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట పట్టణ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి హాస్పిటల్లో పండ్లు పంపిణీ చేసి సునీత మహేందర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సట్టు తిరుమలేష్ మాట్లాడుతూ.. గొంగిడి సునీత మహేందర్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో విద్య, వైద్యం, రోడ్లు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు విశేషంగా పాటుపడ్డారని పేర్కొన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు పనిచేసిన నాయకురాలిగా ఆమెకు ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు.సునీత మహేందర్ రెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని, భవిష్యత్తులో మళ్లీ ఎమ్మెల్యేగా గెలిచి ఆలేరు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి, జలసాధన సమితి అధ్యక్షులు ఎర్రగోకుల జశ్వంత్,మహిళా పార్టీ అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి,పార్టీ సెక్రటరీ జనరల్ సందుల భాస్కర్ గౌడ్, మహిళా నాయకురాలు రమాదేవి, సింగిల్ విండో వైస్ చైర్మన్ మాజీ కాకల్ల ఉపేందర్, డైరెక్టర్ నాగరాజ్ కూతురు లింగం బేగంపేట్ హరినాథ్ యాదగిరి గౌడ్ వెంకన్న బొంగోలి ఉప్పలయ్య కరీం గోపిరెడ్డి మొగిలి నాగరాజ్ ఎమ్మా భాస్కర్ గంధ మల్ల సురేష్ బాలకృష్ణ చెరుకు కనకయ్య రాములు నాయక్ లక్ష్మణ్ నాయక్ బోనాల వెంకటేష్ కరుణాకర్ రెడ్డి నరసింహారెడ్డి బొందుగుల ఉపసర్పంచ్ ఎండి ఆబిద్ ఉపేందర్ ఉప్పలయ్య కిష్టయ్య రమేష్ ఉప సర్పంచ్ రాజు మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రావణమా తొలి బోనాలు

### శాలివాహన( కుమ్మరి) వారి బోనాల ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి

**సంస్థాన్ నారాయణపురం, ఆగష్టు 16(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో శాలివాహన( కుమ్మరి) వాడలో శ్రావణమాస తొలి బోనాల కార్యక్రమంలో శానివాహన సంఘం అధ్యక్షులు చిలువేరు( లారీ )బిక్షం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి హాజరై ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించి బోనాల ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి మాట్లాడుతూ గ్రామంలో శ్రావణమాసం సందర్భంగా తొలి బోనాలు సమర్పిస్తున్నటువంటి గ్రామ కుమ్మరి సంఘం మరియు గంగపుత్ర సంఘం నాయకులకు భక్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు సర్పంచ్ గ్రామంలో సకాలంలో వర్షాలు పడి గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరారు.



ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై సిత్య పాండు , మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి నరసింహ, శాలివాహన సంఘం నాయకులు, భక్తులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కంటోన్మెంట్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

### 450 మంది విద్యార్థులకు జ్యోతి సేవా సంస్థ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనం

### విద్యార్థుల సంక్షేమమే లక్ష్యంగా సేవా కార్యక్రమం




**కూకట్ పల్లి, ఆగస్టు 16 (క్రైమ్ మిర్రర్) :** దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పాత బోయినపల్లిలోని టి.ఎం.ఆర్.ఎస్ అండ్ జె.సి. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బాలుర పాఠశాలలో జ్యోతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న సుమారు 450 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేసి విద్యార్థుల పట్ల తమ సేవాభావాన్ని చాటుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవ స్ఫూర్తిని సేవా కార్యక్రమాలతో ముడిపెట్టి విద్యార్థులకు భోజనం అందించడం పట్ల పాఠశాల సిబ్బంది, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు, విద్యార్థులకు అండగా నిలవడం ద్వారా సేవా భావాన్ని మరింత విస్తరించాలనే లక్ష్యంతో జ్యోతి సేవా సంస్థ నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తోందని సంస్థ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా పి. హనుమంతరావు, నరసింహ, వీరయ్య, రాములు, సాయి కిషోర్, విట్టల్, వెంకట్రావు, అశోక్, దయానంద్, ఉమా ప్రసాద్, గోవిందయ్య, రాజేశ్వరి తదితర జ్యోతి సేవా సంస్థ సభ్యులు పాల్గొని విద్యార్థులకు భోజనం అందజేశారు..“స్వాతంత్ర్య వేడుకలు కేవలం జెండా ఆవిష్కరణకే పరిమితం కాకుండా.. సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి ఉపయోగపడినప్పుడే వాటి స్ఫూర్తి మరింత బలపడుతుంది” అని సంస్థ సభ్యులు పేర్కొన్నారు. విద్యార్థుల ముఖాల్లో చిరునవ్వులు తీసుకురావడం, వారికి ఆప్యాయతతో భోజనం అందించడం ద్వారా స్వాతంత్ర్య దినోత్సవాన్ని సేవా స్ఫూర్తితో జరుపుకోవడం విశేషంగా నిలిచింది.

## కాంగ్రెస్ గుండాల దాడిలో గాయపడిన బిఆర్ఎస్ యువజన నాయకులు గుణగంటి చంద్రకాంత్ గౌడ్ ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే డా.గాదరి కిశోర్ కుమార్



**జాజిరెడ్డిగూడెం, ఆగష్టు 16(క్రైమ్ మిర్రర్):** తుంగతుర్తి నియోజకవర్గంలోని జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ యువజన నాయకులు గుణగంటి చంద్రకాంత్ గౌడ్ పై కాంగ్రెస్ గుండాలు కత్తులతో దాడి చేయడంతో ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్న వారిని పరామర్శించి, ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, తక్షణ సహాయంగా 25,000/- ఇరవై ఐదు వేల రూపాయలు ఆర్థికసాయం అందజేసి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్. వారికి పార్టీ తరుపున అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా కల్పించి, దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# పార్కుల స్థలాలు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది

## కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

### పార్కు స్థలాన్ని కూడా అమ్మొద్దు".. సీఎం రేవంత్‌రెడ్డికి చిన్నారుల విజ్ఞప్తి






**కూకట్ పల్లి, ఆగస్టు 16 (క్రైమ్ మిర్రర్) :** హైదర్‌నగర్ మిత్ర హిల్స్ ప్రాంతంలో పార్కు కోసం కేటాయించిన స్థలాన్ని విక్రయించవద్దంటూ స్థానికులు చేపట్టిన ఆందోళనకు చిన్నారులు సైతం మద్దతుగా నిలిచారు. తమ ఆటస్థలాన్ని కాపాడాలని, పార్కు స్థలాన్ని ఇతర అవసరాలకు వినియోగించకుండా రక్షించాలని చిన్నారులు ప్రభుత్వాన్ని కోరారు. ధర్నాలో చిన్నారులు పాల్గొని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. "మేము ఆడుకోవడానికి స్థలం ఎక్కడ ఉంది? పార్కు స్థలాన్ని కూడా అమ్మేస్తే మేమెక్కడ ఆడుకోవాలి?" అంటూ వారు ప్రశ్నించారు. మిత్ర హిల్స్‌లో పిల్లలు, వృద్ధులు, స్థానిక ప్రజలకు ఉపయోగపడే పార్కు స్థలం భవిష్యత్ తరాలకు ఎంతో అవసరమని స్థానికులు పేర్కొన్నారు. ఇప్పటికే నగరంలో ఆటస్థలాలు, పార్కుల కొరత ఉందని, ఉన్న పార్కు స్థలాలను కూడా విక్రయిస్తే పిల్లలకు ఆడుకునే అవకాశం లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. "పార్కులు, ఆటస్థలాలు పిల్లల హక్కు. వాటిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. మా పార్కు స్థలాన్ని కాపాడండి" అంటూ చిన్నారులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. చిన్నారులు సైతం ధర్నాలో పాల్గొని "పార్కు స్థలాన్ని అమ్మొద్దు.. మా ఆటస్థలాన్ని కాపాడండి" అంటూ నినాదాలు చేయడం అక్కడి వారిని ఆకట్టుకుంది. ప్రభుత్వం స్పందించి పార్కు స్థలాన్ని పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

**పార్కు స్థలం కోసం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు స్థానికులు ఫిర్యాదు**

శేర్లింగంపల్లి నియోజకవర్గం హైదర్నగర్ డివిజన్ మిత్రాహిల్స్ కాలనీలో పార్కు స్థలాన్ని హెచ్ఎండిఏ అధికారులు అమ్మకం కోసం నోటిఫికేషన్ వేశారని ఎన్నో సంవత్సరాలుగా అపార్ట్మెంట్లో ప్లాట్లు కొనుక్కొని ఉద్యోగాలు చేస్తూ సాయంకాలం సమయంలో పిల్లలతో కలిసి జాగింగ్ చేస్తూ ఉండే పార్క్ స్థలాన్ని అమ్మకం చేపడుతున్నారని కాలనీవాసులు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కి ఫిర్యాదు చేయగా కాలనీవాసులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ రెండున్నర ఏళ్లలో ప్రభుత్వ భూములను అమ్మడమే తప్ప ప్రజలకు ఇచ్చే సంక్షేమాలు గాలికి వదిలేసి అభివృద్ధిని పక్కనపెట్టి ఎన్నో ఏళ్లగా కాపాడుకున్న భూములను కాంగ్రెస్ సర్కార్ అమ్మేస్తుందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శేర్లింగంపల్లి నియోజకవర్గం హైదర్ నగర్ డివిజన్ మిత్ర హిల్స్ కాలనీలో 2002 నుండి ప్రభుత్వ పార్కు కోసం కేటాయించిన భూమిని కాలనీలో బిల్డింగులు నిర్మించుకొని మధ్యలో పార్క్ ఉండడం వల్ల ఉదయం, సాయంకాలం పాదాచార్యులు వాకింగ్ చేసుకోవడం చిన్నపిల్లలు ఆడుకోవడానికి కాలనీకి ఆక్సిజన్ ఇచ్చే మార్పుని సైతం అమ్మడానికి హెచ్ఎండిఏ అధికారులు టెండర్ నోటీస్ వేయడంతో మిత్ర హిల్స్ కాలనీవాసులంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వేనెంబర్ 65 లో ఒక ఎకరం 30 గుంటలు ప్రభుత్వ భూమి పార్కు కోసం కేటాయిస్తే దాంట్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు అనుచరులు సైతం కబ్జాలు చేసి ఇండ్లు కట్టుకుంటే మిగిలిన పార్కు భూమిని సైతం వేలం వేసి అమ్మడానికి చూస్తుంటే ప్రజలందరూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మా పార్కు మాకు కావాలని, మా పార్క్ ని అమ్మ వద్దని చిన్నపిల్లలు సైతం చెప్పే మాటలను రేవంత్ సర్కార్ విని పార్కు స్థలం వేలం వెనక్కు తీసుకోవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు సిద్ధం శ్రీకాంత్, సంజీవరెడ్డి, సుబ్బరాజు, నవతారెడ్డి, సతీష్ రావు, అనిల్ రెడ్డి, నక్క శ్రీనివాస్, ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలను నివసించే ప్రాంతంలో సుమని క్లినిక్ ను ఏర్పాటు చేయడం అభినందనీయం

### ఈ ప్రాంతంలో నివసించే ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలి

### పిఏసీ చెర్మెన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

**కూకట్ పల్లి, ఆగస్టు 16 (క్రైమ్ మిర్రర్) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్, హనుమాన్ నగర్ లో నూతన సుమని హెల్త్ అండ్ రిహాబీటేషన్ క్లినిక్ ను మాజీ కార్పొరేట్ ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు చంద్రకాంత్ రావు, జిల్లా గణేష్ తోపాటు కలిసి స్థానిక ఎమ్మెల్యే పిఏసీ చెర్మెన్ అరికెపూడి గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగ ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ సుమని క్లినిక్ యజమాని డాక్టర్ సుకన్య ను అభినదించారు. అలాగే ఇక్కడ నివసించే కుటుంబాలు పేద మధ్యతరగతి వారు ఎక్కువగా ఉంటారని, వారికి నాణ్యమైన వైద్యం అందించాలని చెప్పారు. ఇక్కడ జనరల్ పిజిషన్, స్పీచ్ తెరాపి, పిజియో తెరాపి వైద్యులు అందుబాటులో ఉండడం విశేషం, మంచి వైద్యం అందించి ప్రజల మన్ననలు పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలు కాలనీ పెద్దలు, వైద్య నిపుణులు తదితరులు పాల్గొన్నారు.





క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595


# ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం వాజ్‌పేయి చేసిన సేవలు చిరస్మరణీయం



### వాజ్‌పేయి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి

### భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయికి ఘన నివాళులర్పించిన బీజేపీ సీనియర్ నాయకులు కాంచి మహేందర్

**బాలానగర్, ఆగస్టు 16 (క్రైమ్ మిర్రర్) :** భారత రాజకీయాల్లో విలువలు, సిద్ధాంతాలు, నిబద్ధతకు ప్రతీకగా నిలిచిన మాజీ ప్రధానమంత్రి, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు కాంచి మహేందర్ ఘనంగా నివాళులర్పించారు. వాజ్‌పేయి విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాంచి మహేందర్ మాట్లాడుతూ.. దేశ సేవనే జీవిత ధ్యేయంగా భావించి, భారతదేశ అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన మహానేత అటల్ బిహారీ వాజ్‌పేయి అని కొనియాడారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి పనిచేసిన అరుదైన రాజకీయ నాయకుడు వాజ్‌పేయి అని అన్నారు. దేశ సమగ్ర అభివృద్ధి, జాతీయ సమైక్యత, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. వాజ్‌పేయి ప్రసంగాలు, దేశభక్తి, స్ఫూర్తి, ఆదర్శాలు నేటి తరానికి కూడా మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. "వాజ్‌పేయి ఆశయాలను ఆచరణలో పెట్టి, ఆయన చూపిన ప్రజాసేవా మార్గంలో ముందుకు సాగడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి" అని కాంచి మహేందర్ పేర్కొన్నారు. దేశం కోసం ఆయన చేసిన సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు.



# ఉపసర్పంచ్ సోడా ప్రవీణ్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ శాసనసభ్యులు డా.గాదరి కిశోర్ కుమార్

**తిరుమలగిరి, ఆగస్టు 16(క్రైమ్ మిర్రర్):** సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం చింతకుంట తండా గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ సోడా ప్రవీణ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించడంతో వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు డా.గాదరి కిశోర్ కుమార్. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మందమర్రిలో నూతన కళ్యాణిఖని ప్రెస్ క్లబ్ ఏర్పాటు

### క్లబ్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా పార్వతి రాజేష్ కుమార్ ఎన్నిక



**మందమర్రి టౌన్ ఆగస్టు 16 క్రైమ్ మిర్రర్:** జర్నలిస్టుల ఐక్యత, వృత్తి పరమైన సహకారం, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం లక్ష్యంగా ఆదివారం మందమర్రి లో నూతనంగా కళ్యాణిఖని ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేశామని అధ్యక్షుడు పార్వతి రాజేష్ కుమార్ తెలిపారు. పట్టణంలో నిర్వహించిన సమావేశంలో క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా పార్వతి రాజేష్ కుమార్, జనరల్ సెక్రటరీగా రామ్ వేణు, కోశాధికారి తెల్ల విజయ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొమ్ము రాజేష్, గౌరవ సలహాదారుగా కనపర్తి రమేష్ ఎన్నికయ్యారు. అలాగే వైస్ ప్రెసిడెంట్లుగా మదాసు కుమార్, గరిగే సుమన్, ఎగుడ రాయమల్లు, జాయింట్ సెక్రటరీలుగా మాసు రాకేశ్, కంది రాజేశం, కాగితపు శ్రీనివాస్, లీగల్ అడ్వైజర్‌గా అడిచెర్ల నాగేందర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా జీవన్ కుమార్, పి.ఆర్.ఓ. క్లబ్ ఇంచార్జిగా బీరం రవి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ కళ్యాణిఖని ప్రెస్ క్లబ్‌ను జర్నలిస్టుల ఐక్యతకు వేదికగా తీర్చిదిద్దడంతో పాటు, ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తామని తెలిపారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం కృషి చేస్తామని, వృత్తి విలువలను కాపాడుతూ క్లబ్‌ను ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. నూతన కార్యవర్గం ఏర్పాటు కావడంతో జర్నలిస్టులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు.

# ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చిన ఫొటోకు అవార్డు

### ఫోటోజర్నలిజం ప్రతిభ చూపిన నమస్తే తెలంగాణ శ్రవణ్ కుమార్ ను వరించిన రాష్ట్ర స్థాయి అవార్డు

**కూకట్‌పల్లి, ఆగస్టు 16 (క్రైమ్ మిర్రర్):** తెలంగాణ స్టేట్ ఫోటోజర్నలిస్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యూస్ ఫోటో కాంపిటీషన్--2026లో కూకట్‌పల్లి నమస్తే తెలంగాణ ఫోటోజర్నలిస్ట్ గడ్డం శ్రవణ్ కుమార్ అవార్డు అందుకున్నారు. ప్రజా సమస్యలను ప్రతిబింబించేలా తీసిన ఫోటోకు ఈ అవార్డు దక్కింది. ఈ సందర్భంగా శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను ఫోటోల రూపంలో వెలుగులోకి తీసుకురావడం, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేయడం ఎంతో సంతృప్తినిచ్చే విషయమన్నారు. జర్నలిజం ద్వారా ప్రజాసేవ చేసే అవకాశం లభించడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. తన కృషిని గుర్తించి అవార్డుతో సత్కరించిన తెలంగాణ స్టేట్ ఫోటోజర్నలిస్ట్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలను కెమెరా కంటితో చూపిస్తూ, సమాజానికి ఉపయోగపడే కథనాలకు మరింత ప్రాధాన్యం ఇస్తానని శ్రవణ్ కుమార్ పేర్కొన్నారు.



# ట్యాంకర్ల నుంచి కెమికల్స్ దారి మళ్లింపు.. ఐదుగురు అరెస్ట్



**నల్లగొండ నిఘా ప్రతినిధి(క్రైమ్ మిర్రర్):** ట్యాంకర్ లారీల్లో రవాణా చేస్తున్న పారిశ్రామిక రసాయనాలను అక్రమంగా దారి మళ్లించి, డ్రమ్ముల్లో నిల్వచేసి ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తున్న ముఠాను చిట్యాల పోలీసులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు వెలిమినేడు గ్రామ శివారులోని రాజస్థాన్ ధాబా వెనుక పార్కింగ్ ప్రాంతంలో, శనివారం నిర్వహించిన తనిఖీల్లో ఈ అక్రమ దందా వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారంలో ప్రధాన నిందితుడితో పాటు ఇద్దరు ట్యాంకర్ డ్రైవర్లు, ఇద్దరు కూలీలు కలిపి ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. జాతీయ రహదారి--65పై రసాయనాలను రవాణా చేసే ట్యాంకర్ డ్రైవర్లతో ప్రధాన నిందితుడు చాపల సత్యనారాయణ అలియాస్ సతీష్ కుమ్మక్కయ్యాడు. పరిశ్రమలకు చేరాల్సిన సాల్వెంట్లు, ఐసోప్రొపైల్ ఆల్కహాల్, మిథనాల్ తదితర పారిశ్రామిక రసాయనాలను ట్యాంకర్ల నుంచి, కొంతమేర అక్రమంగా బయటకు తీసి తక్కువ ధరకు కొనుగోలు చేసేవాడని దర్యాప్తులో గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం రసాయనాలను బొలెరో, మినీ డీసీఎం వంటి వాహనాల్లో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నిల్వ చేసి హైదరాబాద్‌తో పాటు, ఇతర ప్రాంతాలకు తరలించేవారని వెల్లడించారు. అక్కడ వాటిని అధిక ధరలకు విక్రయిస్తూ అక్రమంగా, లాభాలు ఆర్జిస్తున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని పోలీసులు పేర్కొన్నారు. వెలిమినేడు శివారులోని రాజస్థాన్ ధాబా వెనుక పార్కింగ్ స్థలంలో, అనుమానాస్పదంగా నిలిపి ఉంచిన వాహనాలను పోలీసులు తనిఖీ చేయడంతో ఈ వ్యవహారం బయటపడింది. రసాయనాలను తరలించేందుకు ఉపయోగించిన వాహనాలతో పాటు, వాటిని నిల్వ చేసేందుకు వినియోగిస్తున్న ప్లాస్టిక్ డ్రమ్ములు, పైపులు, ఇతర పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ట్యాంకర్లకు సంబంధించిన ఇన్వాయిసులు, రవాణా పత్రాలు, ఇతర రికార్డులను సైతం స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు.

**ఐదుగురు నిందితుల అరెస్ట్**

ఈ కేసులో వెల్లంకి గ్రామానికి చెందిన చాపల సత్యనారాయణ అలియాస్ సతీష్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ట్యాంకర్ డ్రైవర్లు బిపిన్ కుమార్ యాదవ్, నవీన్ కుమార్, చిట్యాల మండలంలోని ఖాల్సా ధాబాకు చెందిన కూలీలు రాకేష్ ప్రసాద్, అమిత్ కుమార్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. అక్రమ దందాకు వినియోగించిన రెండు బొలెరో వాహనాలు, ఒక మినీ డీసీఎం, రెండు కెమికల్ ట్యాంకర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు పారిశ్రామిక రసాయనాలతో నింపిన పలు ప్లాస్టిక్ డ్రమ్ములు, రసాయనాలను ట్యాంకర్ల నుంచి బయటకు తీసేందుకు ఉపయోగించిన పైపులు, ఇతర పరికరాలు, రవాణా పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

**పరిశ్రమలకు నష్టం కలిగించేలా..దొంగతనాలు**

రవాణా కోసం అప్పగించిన పారిశ్రామిక రసాయనాలను గమ్యస్థానానికి పూర్తిగా చేర్చకుండా, అక్రమంగా దారి మళ్లించి విక్రయించడం ద్వారా సంబంధిత పరిశ్రమలకు ఆర్థిక నష్టం కలిగించినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. అంతే కాకుండా పారిశ్రామిక వినియోగానికి ఉద్దేశించిన రసాయనాల అక్రమ నిల్వ, రవాణా, విక్రయాల వ్యవహారంపై పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా, కోర్టు వారిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించింది. ఈ అక్రమ రసాయనాల దందా వెనుక ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉంది? ట్యాంకర్ డ్రైవర్లతో పాటు మరికొందరు వ్యక్తులు ఈ వ్యవహారంలో భాగస్వాములుగా ఉన్నారా? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. నార్కెట్‌పల్లి సీఐ ఆధ్వర్యంలో చిట్యాల పోలీసులు కేసు దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

# ఎంఎస్ఎన్ పరిశ్రమ నిర్లక్ష్యంతోనే కార్మికుడి మృతి: సిఐటీయు

**వెంకటేశ్వర్లు కుటుంబానికి కోటి పరిహారం ఇవ్వాలని డిమాండ్**

**కార్మికుల భద్రతపై యాజమాన్యం నిర్లక్ష్యం తగదు**

**నష్టపరిహారం చెల్లించకపోతే ఎంఎస్ఎన్ పరిశ్రమ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన**




**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 16:** రుద్రారం ఎంఎస్ఎన్ పరిశ్రమలో వేడి నీరు పడి చికిత్స పొందుతూ మృతి చెందిన కార్మికుడు వెంకటేశ్వర్లు కుటుంబానికి యాజమాన్యం కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలని సిఐటియు సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు బి. నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. చిట్కుల్ పార్థసారథి నగర్‌కు చెందిన వెంకటేశ్వర్లు గత 13 సంవత్సరాలుగా ఎంఎస్ఎన్ పరిశ్రమలో ఫిట్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ నెల 11న విధుల్లో భాగంగా ఎంఈ ప్లాంట్‌లోని ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు సంబంధించిన తుప్పుపట్టిన పైప్‌లైన్‌ను విప్పుతుండగా లీకేజీ కారణంగా వేడి ద్రవం ఆయన శరీరంపై పడటంతో తీవ్రంగా గాయపడ్డారని పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అంబులెన్స్ ఏర్పాటు చేయడంలో పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యం చేసిందని, డీజిల్ లేదనే కారణంతో సుమారు గంటపాటు పరిశ్రమలోనే ఉంచారని ఆరోపించారు. అనంతరం కంచన్‌బాగ్‌లోని డీఆర్‌డీవో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు తెలిపారు. పాతకాలపు పనిముట్లు, పైప్‌లైన్లను ఉపయోగించడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని, కార్మికుల భద్రత విషయంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని నాగేశ్వరరావు ఆరోపించారు. వెంకటేశ్వర్లు మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంఎస్ఎన్ పరిశ్రమలో గతంలోనూ పలువురు కార్మికులు ప్రమాదాలకు గురై మృతి చెందినప్పటికీ, ఘటనలను బయటకు రానివ్వకుండా యాజమాన్యం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. మృతుల కుటుంబాలకు సరైన నష్టపరిహారం అందకపోవడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అదేవిధంగా పరిశ్రమ కారణంగా రుద్రారం గ్రామంలో వాయు కాలుష్యం, పెద్ద చెరువులో జల కాలుష్యం పెరిగిందని, చేపలు మృతి చెందిన ఘటనలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు పరిశ్రమపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. పరిశ్రమల్లో వరుసగా ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారులు తనిఖీలు నిర్వహించకపోవడం వల్ల కార్మికుల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోందని విమర్శించారు. వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులతో చర్చించి, బాధిత కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం అందేలా పరిశ్రమ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధిత కుటుంబ సభ్యులతో కలిసి ఎంఎస్ఎన్ పరిశ్రమ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## ఖమ్మం జిల్లా స్థాయి యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్షిప్




**క్రైమ్ మిర్రర్ ఖమ్మం :** ఖమ్మం జిల్లా స్థాయి యోగాసనా స్పోర్ట్స్ ఛాంపియన్షిప్ పోటీలు ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని గురుదక్షిణ ఫౌండేషన్ లో ఘనంగా నిర్వహించారు. ఏదులాపురం మున్సిపల్ చైర్ పర్సన్ పోకబత్తిన అనిత ప్రారంభించారు. ఖమ్మ జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోషియేషన్ జిల్లా కన్వీనర్ కమర్తపు గోపాల్ రావు కో కోన్వీనర్ ఇ కిషోర్ యోగా నేషనల్ కోచ్ జిప్ట్ వై రమేష్ గురు కోదండరావు సభ్యులు కే సీతారాములు ఎం కోటేశ్వరరావు దామిదర్ రామిరెడ్డి శ్రీనివాసంది నవీన్ పుల్లయ్య చంద్రశేఖర్ చావా సత్యనారాయణ ప్రసాద్ జి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమం సందర్భంగా హాజరైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు ఎన్సిసి కల్నల్ ఎస్.కె భద్ర హాజరై ఆయన చేతుల మీదగా అందించారు.

# అత్తాపూర్‌లో భక్తిశ్రద్ధలతో శ్రావణమాస కావడి యాత్ర

**ఘనంగా శివాభిషేకం**





**గండిపేట్,(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని అత్తాపూర్ నుండి రాంబాగ్ నివాసితులు శ్రావణమాసాన్ని పురస్కరించుకుని కావడి యాత్రను అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ యాత్రలో దాదాపు రెండు వందల మందికి పైగా భక్తులు పాల్గొన్నారు. మహిళలు, చిన్న పిల్లల ఆటపాటలు, శివనామ స్మరణల నడుమ ఈ శోభాయాత్ర కోలాహలంగా సాగింది. అత్తాపూర్ నుండి బయలుదేరిన ఈ యాత్ర చిన్న అనంతగిరి శివాలయం వరకు కొనసాగింది. ఆలయానికి చేరుకున్న భక్తులు పవిత్ర అభిషేక జలాలతో పరమశివునికి ప్రత్యేక అభిషేకాలు మరియు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు, మూగజీవులు మరియు సకల జనులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంతోషంగా ఉండాలని కోరుకుంటూ ప్రతి ఏటా ఈ కావడి యాత్రను ఎంతో నిష్ఠతో నిర్వహిస్తున్నామని తెలిపారు.



## జే ఆర్ సీ కన్వెన్షన్‌లో బండ్ల గణేష్ కుమార్తె వివాహం...

**శేరిలింగంపల్లి క్రైమ్ మిర్రర్ :** హైదరాబాద్ జేఆర్సీ కన్వెన్షన్‌లో సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేష్ కుమార్తె వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ వేడుకకు టీ జీ ఎం ఎఫ్ సీచైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్ హాజరై నూతన వధూవరులపై అక్షింతలు వేసి ఆశీర్వదించారు. వధూవరులు జీవితాంతం సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. వివాహానికి పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు, అభిమానులు హాజరై నూతన జంటను అభినందించారు.

## చందానగర్ లో శ్రీశక్తి సనాతన శక్తి" కార్యక్రమం... గవర్నర్‌కు ఘన సత్కారం.....



చందానగర్ క్రైమ్ మిర్రర్ :: చందానగర్‌లోని శ్రీశ్రీ శారదాపీఠ పాలిత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో "శ్రీశక్తి సనాతన శక్తి" కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్ శ్రీ శివప్రసాద్ శుక్లా హాజరై, శ్రీ శారదాపీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి, స్వాత్మానంద స్వామి వారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా శేర్లింగంపల్లి సీనియర్ కాంగ్రెస్ నాయకులు మిరియాల రాఘవరావు మిరియాల ప్రీతమ్ కుటుంబ సమేతంగా గవర్నర్‌ను కలిసి ఘనంగా సత్కరించారు. సనాతన ధర్మ విలువలు, ఆధ్యాత్మికత, ధర్మ పరిరక్షణపై ప్రముఖులు ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ సనాతన ధర్మ పరిరక్షణకు కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## కాటేదాన్‌లో జాండ్ర సంఘం భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**గండిపేట్,(క్రైమ్ మిర్రర్):** కాటేదాన్ పరిధిలో తెలంగాణ జాండ్ర సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన జాండ్ర సంఘం భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై వైభవంగా ప్రారంభించారు. అతి తక్కువ కాలంలోనే భవనాన్ని అత్యంత సుందరంగా నిర్మించుకోవడం పట్ల ఆయన సంఘ ప్రతినిధులను అభినందించారు. ఏ సంఘానికైనా తాను వెన్నంటి ఉండి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు. ఇలాంటి కుల సంఘాలు బలంగా ఉన్నప్పుడే సమాజం కూడా బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ఇంత పెద్ద సంఖ్యలో జాండ్ర కుల బంధువులు, ప్రజలు హాజరుకావడం చూస్తుంటే చాలా ఆనందంగా ఉందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జాండ్ర సంఘం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పోట్ల రామస్వామి, తెలంగాణ జాండ్ర సంఘం అధ్యక్షుడు బుగుడి అనూప్ కుమార్, కాటేడాన్ అధ్యక్షుడు కామర్తి ఎల్లప్ప, దేవరకొండ వెంకటేష్, శ్యామ్ లింగం, నిఖిల్, శ్రీనివాస్, నరేష్, రవి, సానే కిట్టు మరియు పెద్ద సంఖ్యలో జాండ్ర కుల బంధువులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# నార్సింగి రేషన్ షాప్ వద్ద ప్రజల తీవ్ర అవస్థలు

## డీలర్ల నిర్లక్ష్యంపై మాజీ కౌన్సిలర్ ఉషారాణి తీవ్ర ఆగ్రహం








**గండిపేట్,(క్రైమ్ మిర్రర్):** నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని రేషన్ షాప్ నెంబర్లు నాలుగు మరియు ఇరవై ఐదు వద్ద నిత్యావసర సరుకుల పంపిణీలో తీవ్ర అలసత్వం వహిస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న తీరుపై మాజీ కౌన్సిలర్ ఉషారాణి అధికారులపై, డీలర్ వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం ఏడు గంటల నుండే తీవ్రమైన ఎండలో గ్రామస్తులు, వృద్ధులు, మహిళలు క్యూ లైన్ లో గంటల తరబడి నిలబడ్డా రేషన్ బియ్యం అందక అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే డీలర్ అయిన శ్రవణ్ నాయక్ కు నార్సింగి మరియు పుప్పాలగూడ రెండు రేషన్ షాపుల నిర్వహణ బాధ్యతలు కేటాయించడం వల్లే ఈ సమస్యాత్మక పరిస్థితి నెలకొందని తెలిపారు. స్థానిక సమస్యలపై అవగాహన ఉన్న గ్రామస్తులకు కాకుండా కరీంనగర్, మహబూబ్నగర్ వంటి దూర ప్రాంతాలకు చెందిన వ్యక్తులకు ఇక్కడ రేషన్ షాపుల నిర్వహణ కేటాయించడంపై నార్సింగి గ్రామస్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. తెల్లవారుజామున ఐదున్నర గంటల నుండే లైన్ లో నిలబడ్డామని బాధితులు వాపోతే, ఈ రోజు కుదరదని రేపు రావాలని డీలర్ చాలా నిర్లక్ష్యంగా బదులిచ్చారని మండిపడ్డారు. రోజూ పనిపాటలు వదిలేసి రావడం కష్టమని, కనీసం రోజువారీ క్రమం కోసం టోకెన్ ఇవ్వమని ప్రజలు వేడుకోగా, టోకెన్ సిస్టమ్ ఏమీ లేదని, రేపు కూడా ఉదయమే వచ్చి లైన్ లోనే నిలబడాలని షాప్ నంబర్ నాలుగు డీలర్ నిర్లక్ష్యపు సమాధానం చెప్పడం పట్ల గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంట్లో తీవ్ర అనారోగ్యంతో ఉన్న రోగులు ఉన్నారని, తమకు త్వరగా రేషన్ ఇచ్చి పంపాలని విజ్ఞప్తి చేసినా కనీస మానవత్వం లేకుండా ప్రవర్తించారని ఆరోపించారు. ఎవరొచ్చినా సరే సరుకులు ఇచ్చేది లేదని, సాయంత్రం నాలుగు గంటలకు రమ్మని చెప్పి ఏకపక్షంగా షాప్ మూసివేసి వెళ్ళిపోవడంతో బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే వ్యక్తికి రెండు షాపులు ఇవ్వడం వల్ల నిర్వహణ లోపించి ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని, వెంటనే నియమాలను మార్చి ఒక వ్యక్తికి ఒకే రేషన్ షాపు ఉండేలా చూడాలని అధికారులను కోరారు. అలాగే స్థానిక గ్రామానికి చెందిన వారికి మాత్రమే రేషన్ షాపుల నిర్వహణ బాధ్యతలు కేటాయించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న డీలర్ పై తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని మాజీ కౌన్సిలర్ ఉషారాణి ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు.



## కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు మెరిట్ స్కాలర్షిప్ లు అందించిన బ్రాంచ్ మేనేజర్



**క్రైమ్ మిర్రర్ ఖమ్మం జిల్లా :** ఖమ్మం నగరంలోని కెనరా బ్యాంక్ మమత రోడ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో సి.ఎస్.ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) లో భాగంగా 80వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కెనరా విద్యా జ్యోతి పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలో ఐదవ తరగతి నుండి పదవ తరగతి చదువుతున్న ఎస్సీ ఎస్టీ పేద విద్యార్థులకు మెరిట్ స్కాలర్షిప్ ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ మమత రోడ్ బ్రాంచ్ మేనేజర్ కొనుగంటి ప్రవీణ్ కుమార్,అసిస్టెంట్ మేనేజర్ మారీశ్వరరావు, క్యాషియర్ రాంబాబు, వెంకటరమణ మరియు శాంతినగర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు , విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## ప్రశాంతంగా ముగిసిన యూపీఎస్సీ సివిల్స్ లాంగ్ టర్మ్ కోచింగ్ స్క్రీనింగ్ టెస్ట్

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో :** ఖమ్మం బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూపీఎస్సీ సివిల్స్ లాంగ్ టర్మ్ కోచింగ్‌కు అభ్యర్థుల ఎంపిక కోసం నిర్వహించిన స్క్రీనింగ్ టెస్ట్ శ్రీ చైతన్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్ ఇంజనీరింగ్ కళాశాల పొన్నెకల్లులో విజయవంతంగా ముగిసింది.ఈ స్క్రీనింగ్ పరీక్షను హెచ్ ఓ డి వి.సుదర్శన్ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జి.శ్రీలత పర్యవేక్షించారు. పరీక్షకు హాజరైన అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేసి పరీక్షను పారదర్శకంగా నిర్వహించారు. ట్రైనింగ్ టెస్ట్ పరీక్షకు సహకరించిన శ్రీ చైతన్య యాజమాన్యానికి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.యూపీఎస్సీ సివిల్స్ వంటి ప్రతిష్టాత్మక పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు మెరుగైన శిక్షణ అందించడమే లక్ష్యంగా బీసీ స్టడీ సర్కిల్ ఈ లాంగ్ టర్మ్ కోచింగ్ ను నిర్వహిస్తుందని తెలిపారు.

## శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ తల్లి ఘట్టం బోనాల ఉత్సవాలపై సమీక్షా....!



**ఈ సంవత్సరం అంబోజి శ్రీకాంత్ యాదవ్ గృహం నుండి అమ్మవారి ఘట్టం ఊరేగింపు...!**

**శ్రీ ఎల్లమ్మ తల్లి దీవెనలతో సంతోషం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు**

**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** మహేశ్వరం మండలం రావిర్యాలలో శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ తల్లి బోనాల ఉత్సవాలు శ్రావణ మాసంలో ఘనంగా నిర్వహిస్తారు అలాగే ఈ సంవత్సరం సెప్టెంబర్ 1వ.తేదీలో నిర్వహించాలని ఆలయ అధికారులు,గ్రామ పెద్దలు నిర్ణయించారు.ప్రతి సంవత్సరం అమ్మవారి ఘట్టం,ఇంట్లో నుండి తీయడానికి గ్రామస్తులు పోటీ పడుతుంటారు..ఈ సంవత్సరం ఘట్టం తీయడానికి పోటీ వచ్చినవారిలో అంబోజి శ్రీకాంత్ యాదవ్ కు అమ్మవారి ఘట్టం ఊరేగింపు ఇంట్లో నుండి తీయడానికి అదృష్టం కలిసి వచ్చింది. ఈ సందర్భంగా శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ..గత మూడు సంవత్సరాలుగా అమ్మవారి ఘట్టం,తీయడానికి పోటీ పడుతున్న కానీ ఈ సంవత్సరం అమ్మవారు దయతలచి ఆశీర్వాదం ఇచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు.ప్రతి సంవత్సరం లాగే ఈ సారి కూడా అమ్మవారి బోనాల ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారని తెలిపారు .గ్రామంలో ఉన్నప్రతి ఒక్కరు పాల్గొని అమ్మవారి బోనాల ఉత్సవాలను విజయవంతం చేయాలి గ్రామ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు,కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు.



## 119 కొత్వాలుగూడ డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీలోకి భారీగా చేరిన యువత





**గండిపేట్,(క్రైమ్ మిర్రర్):** శంషాబాద్ జోన్ పరిధిలోని 119వ డివిజన్ కొత్వాలుగూడ గ్రామం నుండి పెద్ద ఎత్తున యువత బీఆర్ఎస్ పార్టీలో చేరారు. డివిజన్ అధ్యక్షుడు కొనమొల్ల శ్రీనివాస్ అధ్యక్షతన, డివిజన్ వైస్ ప్రెసిడెంట్ గుంటి చరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తిక్ రెడ్డి సమక్షంలో యువత బీఆర్ఎస్ పార్టీ కండువాలు కప్పుకుని పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కొనమొల్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చిన్నగండ రాజేందర్, శంషాబాద్ రెండు డివిజన్ల ఆర్గనైజింగ్ సెక్రటరీ రాచమల్ల జయసింహ, డివిజన్ వైస్ ప్రెసిడెంట్లు గుంటి చరణ్, పేదిరిపాటి మురళి గౌడ్, రాచమల్ల కార్తీక్, యూత్ అధ్యక్షుడు జివి పవిత్ర సాగర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాచమల్ల రమేష్, డివిజన్ కమిటీ నాయకులు ప్రవీణ్ గౌడ్, మోసిన్, గుంటి బాలు, చంద్రశేఖర్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో ఏ చరణ్, నిఖిల్, నవీన్, అనిల్, బేనోసీ, వరుణ్, అరుణ్, వరప్రసాద్, చంటి మరియు ఇతర యువకులు ఉన్నారు. కొత్వాలుగూడలో యువత పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీలో చేరడం పార్టీపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో పెరుగుతున్న ఆదరణకు నిదర్శనమని నాయకులు పేర్కొన్నారు.

# కల్తీకి చెక్.. ఆహారం, మందులపై ఇక 'టీజీ సేఫ్' నిఘా!

**ఫుడ్ సేఫ్టీ, డ్రగ్స్ కంట్రోల్ విభాగాల విలీనంతో 'టీజీ సేఫ్'**

**కొత్త కమిషనర్‌గా ఐపీఎస్ అధికారి అవినాశ్ మహంతి**

**నాణ్యత, నకిలీ ఉత్పత్తుల నియంత్రణకు ఏకీకృత వ్యవస్థ**






**హైదరాబాద్, ఆగస్టు 16 (నేటి ప్రస్థానం):** కల్తీ ఆహారం, నకిలీ మందులపై తెలంగాణ ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించేందుకు కీలక అడుగు వేసింది. ఇప్పటివరకు వేర్వేరుగా పనిచేస్తున్న ఫుడ్ సేఫ్టీ, డ్రగ్స్ కంట్రోల్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చింది. ఈ రెండు విభాగాలను విలీనం చేసి 'టీజీ సేఫ్' (తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్) పేరుతో ఏకీకృత పాలనా వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రజలకు అందే ఆహారం, ఔషధాల నాణ్యతపై మరింత సమర్థవంతమైన పర్యవేక్షణ చేపట్టడంతో పాటు కల్తీ, నకిలీ ఉత్పత్తులను అరికట్టడం ఈ కొత్త వ్యవస్థ ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంది. ఆహార భద్రత, ప్రమాణాల చట్టం-2006, డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం-1940 కింద నిబంధనల అమలును మరింత బలోపేతం చేయనుంది.

**అవినాశ్ మహంతికి బాధ్యతలు**

'టీజీ సేఫ్' నూతన కమిషనర్‌గా ఐపీఎస్ అధికారి అవినాశ్ మహంతిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఆయన డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఔషధ నియంత్రణ రంగంలో ఆయనకు ఉన్న అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది.

**ఆరు విభాగాలతో సమగ్ర వ్యవస్థ**

టీజీ సేఫ్ పరిధిలో డ్రగ్ అడ్మినిస్ట్రేషన్, ఫుడ్ సేఫ్టీ, ఎన్‌ఫోర్స్‌మెంట్, లీగల్ అండ్ ప్రాసిక్యూషన్, లేబొరేటరీ, అడ్మినిస్ట్రేటివ్ విభాగాలు పనిచేయనున్నాయి. దీంతో ఆహారం, ఔషధాల నాణ్యత తనిఖీలు, అమలు చర్యలు, చట్టపరమైన వ్యవహారాలు, పరీక్షలు ఒక సమన్వయ వ్యవస్థలోకి రానున్నాయి. అయితే సంబంధిత చట్టాల ప్రకారం ఆహార భద్రత, ఔషధ నియంత్రణ అధికారులకు ఉన్న చట్టబద్ధమైన అధికారాలు యథాతథంగా కొనసాగుతాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.

### ఆధునిక వ్యవస్థపై దృష్టి


మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నియంత్రణ వ్యవస్థను ఆధునికీకరించేందుకు రాష్ట్రస్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నారు. సర్వీస్ రూల్స్ సమన్వయం, క్షేత్రస్థాయి యూనిట్ల బలోపేతం, ప్రయోగశాలల మౌలిక సదుపాయాల అభివృద్ధి తదితర అంశాలను ఈ కమిటీ పరిశీలించనుంది. దేశ, అంతర్జాతీయ స్థాయిలో అమలవుతున్న ఉత్తమ విధానాలను అధ్యయనం చేసి, తెలంగాణకు అనుగుణంగా మరింత పటిష్ఠమైన నియంత్రణ వ్యవస్థకు సిఫారసులు చేయనుంది. ఆహార వ్యాపార కార్యకలాపాలు విస్తరిస్తున్న నేపథ్యంలో నాణ్యత లేని, కల్తీ, నకిలీ ఆహార పదార్థాలు, ఔషధాల వల్ల ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లకుండా చూడటమే టీజీ సేఫ్ ఏర్పాటు వెనుక ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## రావిర్యాల చౌరస్తాలో రెపరెపలాడిన మువ్వన్నెల జెండా...!

**గోనెమోని కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ పతాక ఆవిష్కరణ**



**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శనివారం రావిర్యాల గ్రామంలోని చౌరస్తాలో జాతీయ జెండాను ఘనంగా ఆవిష్కరించారు.గత 38సంవత్సరాలుగా గ్రామంలో జనవరి 26 గణతంత్ర దినోత్సవం, ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం మరియు అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజుల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేసే కార్యక్రమాన్ని నిరంతరాయంగా నిర్వహిస్తున్న గోనెమని కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.రావిర్యాల గ్రామంలో మొట్టమొదటిసారి జాతీయ జెండాను గాంధీ చౌరస్తాలో ఆవిష్కరిస్తారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ గీతాలాపన చేశారు. అనంతరం స్వతంత్ర సమర యోధులను స్మరించుకున్నారు.గత 38 ఏళ్లుగా ఎలాంటి విరామం లేకుండా ఈ సేవ చేస్తున్న గోనెమోని కుమార్‌ను గ్రామస్తులు అభినందించారు.



## ఇన్‌స్టాలో దుమ్మురేపిన

# ఫౌజీ

### ఫస్ట్‌లుక్ విడుదల కాగానే 5.33 లక్షల లైక్స్

రెబల్ స్టార్ ప్రభాస్ సినిమా అంటే థియేటర్లలో మాత్రమే కాదు, సోషల్ మీడియాలోనూ అభిమానుల సందడి ఏ స్థాయిలో ఉంటుందో మరోసారి నిరూపితమైంది. తాజాగా విడుదలైన ఫౌజీ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ఇన్‌స్టాగ్రామ్‌లో అరుదైన రికార్డును నమోదు చేసి, భారతీయ సినీ ప్రమోషన్లకు కొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేసింది. తాజా గణాంకాల ప్రకారం, 'ఫౌజీ' ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైన తొలి 24 గంటల్లోనే ఏకంగా 5.33 లక్షల షేర్లు సాధించింది. దీంతో ఇన్‌స్టాగ్రామ్‌లో అత్యధికంగా షేర్ చేయబడిన సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌గా ఇది కొత్త రికార్డును సృష్టించింది. అభిమానులు ఈ పోస్టర్‌ను భారీ స్థాయిలో షేర్ చేస్తూ సోషల్ మీడియాలో ఒక డిజిటల్ వేడుకలా మార్చేశారు. ఈ రికార్డు ప్రభాస్ డిజిటల్ క్రేజ్‌కు మరో నిదర్శనంగా మారింది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈసారి ప్రభాస్ మరో హీరో రికార్డును కాదు, తన సొంత రికార్డునే బద్దలు కొట్టారు. గతంలో 'స్పిరిట్' ఫస్ట్ లుక్ పోస్టర్ 5.19 లక్షల షేర్లతో అగ్రస్థానంలో ఉండగా, ఇప్పుడు 'ఫౌజీ' దానిని అధిగమించి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. దీంతో సోషల్ మీడియాలో ప్రభాస్ ఆధిపత్యం మరింత బలపడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పోస్టర్ అభిమానులను అంతగా ఆకట్టుకోవడానికి ప్రధాన కారణం అందులో కనిపించిన ప్రభాస్ లుక్. ఒక వార్ ÷ట్ లో గాయాలతో కూర్చుని ఉన్న ఆ రూపం చాలా క్రేజీగా కనిపిస్తోంది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన ప్రతి అప్‌డేట్‌కు సోషల్ మీడియాలో అద్భుతమైన స్పందన లభిస్తోంది. ఫస్ట్ లుక్‌తో వచ్చిన ఈ రికార్డు సినిమా చుట్టూ ఉన్న హైప్‌ను మరింత పెంచింది. ప్రభాస్ అభిమానులతో పాటు, సినీ ప్రేక్షకులు కూడా ఈ సినిమాపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ పీరియడ్ వార్ డ్రామాను మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ప్రభాస్ పవర్‌ఫుల్ రోల్ లో తెరకెక్కుతున్న ఈ మూవీ డిసెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.




## రామ్‌చరణ్-సుకుమార్ కాంబో

### ఆర్17 పట్టాలకెక్కనుందని ప్రచారం

ఈ ఏడాది పెద్ది సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్టందుకున్న రాంచరణ్ మరోమారు సుకుమార్‌తో సినిమాకు సిద్ధం అవుతున్నారు. వీరి కాంబో రంగస్థలం బాక్సాఫీస్‌ను షేక్ చేసిందని తెలిసిందే. ఈ ఇద్దరి క్రేజీ కాంబోలో మరోసారి ఆర్‌సీ 17సందడి చేసేందుకు రెడీ అవుతోంది. మూవీ లవర్స్‌తోపాటు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న అప్‌డేట్ ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. తాజా టాక్ ప్రకారం ఆర్‌సీ17 మూవీ ఫైనల్ స్క్రిప్ట్ పూర్తయింది. మేకర్స్ త్వరలోనే గ్రాండ్‌గా ఈ సినిమాను షురూ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారని ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. అన్నీ అనుకున్నట్టు కుదిరితే వచ్చే సెప్టెంబర్‌లోనే సినిమా లాంచ్ కానుందట. అంతేకాదు నవంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుందని ఇన్‌సైడ్ టాక్. రంగస్థలం తర్వాత సుకుమార్-రాంచరణ్ కాంబోలో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలపై త్వరలోనే మేకర్స్ క్లారిటీ ఇవ్వనున్నారు. ఈ చిత్రానికి రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడని వార్తలు రాగా.. మరోవైపు ధురంధర్ శశ్వత్ సచ్‌దేవ్ పేరు కూడా తెరపైకి వచ్చింది. రాంచరణ్ నిర్మాతగా నిఖిల్ హీరోగా నటిస్తోన్న ఇండియా హౌస్ చిత్రానికి కూడా శశ్వత్ సచ్‌దేవ్ సంగీతం అందిస్తున్నాడు.

## ప్రెగ్నెన్సీతోనే రాకా షూట్‌లో దీపికా పదుకొణె

బాలీవుడ్ కథానాయిక దీపికా పదుకొణె వృత్తిపట్ల తనకున్న నిబద్ధతను చాటుకుంటున్నారు. అట్లీ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా వస్తున్న 'రాకా'లో ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఈ సినిమా కోసం ప్రెగ్నెన్సీతోనే ఆమె కఠినమైన యాక్షన్ సన్నివేశాలు షూట్ చేశారని సమాచారం. గతంలో 'ఎనిమిది గంటల పని' నిబంధన తెరపైకి తీసుకొచ్చిన దీపికా.. 'రాకా' కోసం మాత్రం ఎలాంటి నిబంధనలు లేకుండా పని చేసినట్లు తెలుస్తోంది. ఇక ఆమె రెండో బిడ్డకు జన్మనివ్వబోతున్న విషయం తెలిసిందే. మెటర్నిటీ బ్రేక్ తీసుకునే ముందే, 'రాకా'లో తన షూటింగ్‌ను పూర్తి చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. అటు షూటింగ్‌లో పాల్గొంటూనే తన మొదటి కూతురు దువాను కూడా చూసుకుంటున్నారు. దీపిక లైఫ్‌ని ఇలా బ్యాలెన్స్ చేస్తుండడంపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రం 2027లో విడుదల కానుంది. అత్యున్నత విజువల్ ఎఫెక్ట్స్‌తో రూపొందిస్తున్నారు. అల్లు అర్జున్‌తో దీపికా పదుకొణె తొలిసారి స్క్రీన్ షేర్ చేసుకుంటుండటంతో ఈ సినిమాపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి.





## నాని ప్యారడైజ్‌కు భారీ డిమాండ్

నాచురల్ స్టార్ నాని నటిస్తున్న తాజా చిత్రం 'ది ప్యారడైజ్' విడుదలకు ముందే ట్రేడ్ వర్గాల్లో భారీ రికార్డ్స్ సృష్టిస్తుంది. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో నాని మరోసారి జతకట్టడంతో ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఇప్పుడు ఆ అంచనాలకు తగ్గట్టుగానే ఈ చిత్రం థియేట్రికల్ బిజినెస్‌లో కొత్త రికార్డులు సృష్టిస్తుంది. తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం.. 'ది ప్యారడైజ్' నైజాం థియేట్రికల్ హక్కులను మైత్రీ డిస్ట్రిబ్యూటర్స్ రూ.37 కోట్లకు సొంతం చేసుకుంది. నాని కెరీర్‌లో ఇప్పటివరకు ఏ చిత్రానికీ ఈ స్థాయిలో నైజాం బిజినెస్ జరగకపోవడంతో ఇది రికార్డు డీల్‌గా నిలిచింది. సినిమా విడుదలకు ఇంకా సమయం ఉండటంతో ఇతర ప్రాంతాల నుంచి కూడా భారీ ఆఫర్లు వచ్చే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## మరోమారు వార్తల్లో నటి నమిత

### స్లిమ్‌గా మారిన ఫోటోలతో నెటిజన్ల ఆసక్తి



ఒకప్పుడు టాలీవుడ్, కోలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరించిన నమిత ఇప్పుడు మరోసారి వార్తల్లో నిలిచారు. పెళ్లి తర్వాత సినిమాలకు దూరంగా ఉంటూ కుటుంబ జీవితంలో బిజీగా గడుపుతున్న ఆమె.. తాజాగా తన ఫిట్‌నెస్ ట్రాన్స్‌ఫర్మేషన్‌తో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు.ఒకప్పుడు బొద్దుగా కనిపించిన నమిత.. ఇప్పుడు పూర్తిగా స్లిమ్‌గా మారి అభిమానులను ఆశ్చర్యపరుస్తున్నారు. జిమ్‌లో కఠినంగా వర్కౌట్స్ చేస్తున్న వీడియోను ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేశారు. మీ మనసు ఏదైతే నమ్ముతుందో.. మీ శరీరం దానినే అనుసరిస్తుంది అనే సందేశాన్ని కూడా ఆ వీడియోకు జత చేశారు. ఈ వీడియో వైరల్ కావడంతో అభిమానులు, నెటిజన్లు వరుసగా కామెంట్లు చేస్తున్నారు. ఇంత స్లిమ్‌గా మారారు ఏంటి?, నిజంగా ఇది నమితేనా?, స్టైలిష్ లుక్ అదిరిపోయింది అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. చాలా మంది ఆమె కొత్త లుక్‌ను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. నమిత సినీ ప్రయాణాన్ని పరిశీలిస్తే.. కన్నడ, తమిళ, తెలుగు, హిందీ భాషల్లో పలు చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తెలుగులో 'సొంతం' సినిమాతో ఎంట్రీ ఇచ్చిన ఆమె.. 'ఒక రాజు ఒక రాణి', 'ఓ రాధ ఇద్దరు కృష్ణుల పెళ్లి', 'బిల్లా', 'నాయకుడు', 'సింహా', 'మన్యం పులి' వంటి చిత్రాల్లో నటించారు. ముఖ్యంగా బాలకృష్ణ నటించిన 'సింహా' సినిమాలో ఆమె గ్లామర్, నటన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పెళ్లి అనంతరం సినిమాలకు విరామం ఇచ్చిన నమిత గత కొన్నేళ్లుగా పూర్తిగా కుటుంబ జీవితానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే తాజాగా ఆమె ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టి సరికొత్త లుక్‌లో కనిపించడంతో.. త్వరలోనే మళ్లీ వెండితెరపై రీఎంట్రీ ఇవ్వబోతున్నారా? అనే చర్చ సినీ వర్గాల్లో మొదలైంది. అయితే దీనిపై నమిత నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

## కియారాపై ట్రోల్స్...బ్రిటిష్ నటుడు బెనెడిక్ట్ ఆగ్రహం

గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో యశ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'టాక్సిక్ లోని 'తబాహి' వీడియో పాటపై ట్రోల్స్ వచ్చాయి. యశ్, కియారా మధ్య ఉన్న రొమాంటిక్ సన్నివేశాలపై నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. యశ్‌ను ప్రశంసిస్తూ.. కియారాను విమర్శించడంపై 'టాక్సిక్'లో నటిస్తోన్న బ్రిటిష్ నటుడు బెనెడిక్ట్ ఆగ్రహం వ్యక్తం చేశారు. యశ్ అద్భుతంగా కనిపించాడంటూ కామెంట్ సెక్షన్‌లో ఎమోజీలతో నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. కానీ కియారా విషయానికి వస్తే, ఆమెను దారుణంగా ట్రోల్ చేస్తున్నారు. 'పెళ్లి అయ్యాక కూడా ఇలాంటి సన్నివేశాల్లో నటించడం అవసరమా' అని మాట్లాడుతున్నారు. ఇది ఎంతవరకు సమంజసం?. యశ్‌కు కూడా పెళ్లయింది.. ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేవలం నటీమణులపైనే ఎందుకు ఇంత దారుణంగా ట్రోలింగ్ జరుగుతోంది? వాస్తవాన్ని గ్రహించండి. వారు నటీనటులు. స్క్రీన్‌పై పాత్రలను పండించడం, కథకు తగ్గట్టుగా నటించడమే వారి పని' అని అన్నారు.




Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.